నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్-ములుగు
శుక్రవారం జులై 26, 2024 www.navatelangana.com

శక్తి వనరులను దుర్వినియోగం చేయకూడదు

జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్

నవతెలంగాణ-ములుగు

శక్తి వనరులను దుర్వినియోగం చేయకూడదని జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ అన్నారు. జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ అధ్యక్షతన, తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్, ములుగు జిల్లా ఇన్చార్జి ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్, క్లైమేట్ చేంజ్, భారత ప్రభుత్వం, సేవ్ ఫౌండేషన్ వారు సంయుక్తంగా ఎల్ఈడి ట్యూబ్ లైట్ల తయారీ వర్క్ షాప్ గురువారం తెలంగాణ ఆదర్శ పాఠశాల చల్వాయి గోవిందరావుపేట మండలం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని 50నేషనల్ గ్రీన్ కార్ప్స్ పాఠశాలలు జిల్లాలోని అన్ని మండలాల నుండి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా అధిక విద్యుత్ శక్తి వినియోగం తగ్గించడం కొరకు తక్కువ విద్యుత్ శక్తితో ఎక్కువ వెలుతురును ఇచ్చే ఎల్ఈడి ట్యూబ్లైట్ల వాడకం వల్ల విద్యుత్ శక్తి వినియోగం తగ్గించి విద్యుత్ శక్తిని పొదుపు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారు 150 మంది విద్యార్థులు హాజరు కాగా ఎల్ఈడీ, ట్యూబ్లైట్ల తయారీ విధానాన్ని వివరించారు. వర్మీ కంపోస్ట్ ప్రాధాన్యత గురించి తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోవిందరావుపేట మండల నోడల్ అధికారి క్రుందూరు సోమారెడ్డి, ములుగు జిల్లా భౌతిక శాస్త్ర ఫోరం అధ్యక్షులు శ్రీ శిర్ప సతీష్ కుమార్, గణిత శాస్త్ర ఫోరం అధ్యక్షులు ఏళ్ల మధుసూదన్, జీవశాస్త్ర ఫోరం సభ్యులు షేక్ దేహముద్, స్థానిక తెలంగాణ ఆదర్శ పాఠశాల బండారుపల్లి ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రీమతి పద్మ, వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన గైడ్ టీచర్లు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్య అధికారి అలెం అప్పయ్య

నవతెలంగాణ-వాజేడు

ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య అధికారి అలెం అప్పయ్య సూచించారు. గురువారం పేరూరు ప్రభుత్వ వైద్యశాల పరిధిలోని కష్టాపురం గ్రామం లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో రక్త నమూనాలు సేకరించి, మలేరియా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇంటి పరిసరాలలో మురుగు నీటి నిల్వలు లేకుండా చేసి దోమల లార్వా వద్ధి చెందకుండా అరికట్టాలని, వర్షాకాల సీజన్లో కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లి ఉచిత వైద్యం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రహీల్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది సుమలత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



చెట్టు మీద పడి ఒకరు మృతి

జాతీయ రహదారిపై సంఘటన

నవతెలంగాణ-ఏటూరు నాగారం (ఐటీడీఏ)

ఏటూరు నాగారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన జాంగిర్ (45) అనే యువకుడిపై గురువారం చెట్టు మీద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నబోయినపల్లి ఏటూర్ నాగారం మార్గమధ్యలో 163వ జాతీయ రహదారిపై పెనుగాలులకు భారీ వక్షం నేలమట్టమయింది. ఈ క్రమంలో చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన జహంగీర్ ద్విచక్ర వాహనంపై తన గ్రామానికి వెళ్తున్నాడు. ఒక్కసారిగా భారీ వక్షం కింద పడే సమయంలో తను చెట్టు కిందకి రావడంతో చెట్టు మీద పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై తాజుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. జేసీబీ సాయంతో రోడ్డుకు అడ్డంగా పడిన వక్షాన్ని తొలగించారు.



జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-నెక్కొండ

మండలంలోని పలు గ్రామపంచాయతీలోని కార్మికులకు 10నెలల నుంచి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పెండింగ్లో ఉన్న జీతాలను చెల్లించాలని గ్రామ పంచాయతీ ఉద్యోగుల యూనియన్ మండల అధ్యక్షుడు భూక్య నరేష్ డిమాండ్ చేశారు. నెక్కొండ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పంచాయతీ అధికారి సునీల్కుమార్కు వేతనాలను ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూక్య నరేష్ మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు నిత్యం పని చేస్తున్న సిబ్బంది చాలిచాలని వేతనాలతో పని చేస్తున్నారని, పంచాయతీ ఉద్యోగులకు వేతనాలు లేక దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే అందించేలా ఎంపీడీవో, ఎంపీవో చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వంగల శ్రీనివాస్, గజ్జల శివరాజు, పాషా, రాధాకష్ణ, కిషోర్, సతీష్, రాజు, కుమారస్వామి, కిషన్, భాస్కర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

మండల ప్రత్యేక అధికారి సంజీవరెడ్డి

నవతెలంగాణ-పర్వతగిరి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల ప్రత్యేక అధికారి సంజీవరెడ్డి సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండల ప్రత్యేక అధికారి సంజీవరెడ్డి అధ్యక్షతన గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో ప్రధానంగా సంభవించే సీజనల్ వ్యాధుల గురించి గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మంచినీటి సరఫరా విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్యం, పరిశుభ్రత పాటించాలని, వాటర్ ట్యాంకులు ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్తో శుభ్రం చేయించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ శంకర్, తహశీల్దార్ టి.వెంకటస్వామి, మండల నోడల్ అధికారి జి.లింగారెడ్డి, ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఓ సుశీల్ కుమార్,ఎస్ బీఎం కో ఆర్డినేటర్ శ్రీనివాస్రావు తదితరులు పాల్గొన్నారు.




కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు శిరుప సతీష్కుమార్

నవతెలంగాణ-గోవిందరావుపేట

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పని చేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ఎస్టీయు జిల్లా అధ్యక్ష కార్య దర్శులు అయిన శిరుప సతీష్ కుమార్ ఏళ్ల మధుసూదన్లు అన్నారు. గురువారం మండలంలోని చలువాయి గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో ఎస్టియు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శిరుప సతీష్ కుమార్, ఏళ్ల మధుసూదన్ మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయులు రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా తమ విధులను నిర్వహిస్తూ విద్యార్థుల ప్రగతికి ఎంతో కష్టపడుతున్న వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని దానిలో భాగంగా గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వారిని రెగ్యులరైజ్ చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల ప్రధాన కార్యదర్శి దాసరి రామ్మూర్తి, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ వెంకటలక్ష్మి ఉపాధ్యాయినిలు జే రమాదేవి ఉదయశ్రీ, గంగా, సరితా , బి. రమాదేవి, శైలజ, సుజాత, శివాని తదితరులు పాల్గొన్నారు,



గురుకులానికి నూతన బిల్డింగ్ మంజూరు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాదు రాకేష్

నవతెలంగాణ-ములుగు

సోషల్ వెల్ఫేర్ చదువుకుంటున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సర్వే చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాదు రాకేష్ మాట్లాడుతూ ములుగు జిల్లా మల్లంపల్లి సోషల్ వెల్ఫర్ పాఠశాల అద్దె భవనం ఉండడం వలన పేద మధ్యతరగతి విద్యార్థులకు సరైన వసతులు లేక వర్షం వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవనంలో పూర్తిస్థాయిలో ఫ్యాన్లు, బాత్రూం, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఫారెస్ట్లోకి వెళ్తున్నారని ఆరోపించారు. వెంటనే సొంత బిల్డింగ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లక్ష్మణ్, సోడి అశోక్, రంజిత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్కు ప్రత్యేక నిధులేవీ..?

వ్యవసాయానికి ప్రాధాన్యం

త్వరలో రైతుభరోసా

ఉమ్మడి వరంగల్లో 42వేల ఇందిరమ్మ ఇండ్లు

త్వరలో 'డబుల్స్' పంపిణీ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

గత ప్రభుత్వం రాష్ట్ర రాజధాని హైద్రాబాద్ తర్వాత రెండో అతిపెద్ద నగరం వరంగల్ అంటూనే ఎలాంటి ప్రత్యేక నిధులు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం సీఎం రేవంత్రెడ్డి వరంగల్ అభివృద్ధిపై ఎన్నో హామిలనిచ్చినా బడ్జెట్లో ఆ దిశగా కేటాయింపులు మాత్రం జరుగలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామిలను నెరవేర్చడానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి నిధులు కేటాయించలేదు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్కు సైతం ప్రత్యేక నిధులను కేటాయించలేదు. హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్కు నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ను విస్మరించడం అసంతృప్తిని మిగిల్చింది. సీఎం వరంగల్-హైద్రాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ను కూడా విస్మరించారు.కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు కేటాయించలేదు. వ్యవసాయరంగానికి భారీగా కేటాయింపులు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.29,164 కోట్లను కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, అనుబంధ శాఖలకు రూ.72,659 కోట్లను కేటాయించింది.

రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే రైతుబంధు స్థానంలో రైతుభరోసా పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించింది. గురువారం రాష్ట్ర శాసనసభలో ఆర్థిక మంత్రి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ను ప్రవేశపెట్టారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామిల అమలుకు అధిక నిధులను కేటాయించారు. వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు కేటాయించారు. ఇప్పటికే రుణమాఫీ పథకం కింద రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని ప్రారంభించింది. తొలుత రూ.1 లక్ష లోపు రుణాలను మాఫీ చేసిన ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీలోపు రూ.2 లక్షల రుణాన్ని మాఫీ చేసే ప్రయత్నంలో వుంది. త్వరలోనే రైతుబంధు పథకం స్థానంలో రైతు భరోసా పథకాన్ని ప్రారంభిస్తామని ఎకరాకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించడం రైతాంగంలో హర్షాతిరేకం వ్యక్తమవుతుంది. ఇదే జరిగితే కేవలం వరంగల్ జిల్లాలోనే 1 లక్షా 54 వేల 822 మంది రైతులకు ఆర్థిక సాయం లబ్ది చేకూరుతుంది. 33 రకాల వరి వంగడాలకు క్వింటాల్కు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించడం గమనార్హం. మహాలక్ష్మీ పథకం కింద గ్యాస్ సిలిండ్ రూ.500లకే ఇచ్చే పథకానికి రూ.723 కోట్లను కేటాయించారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు వినియోగించిన విద్యుత్ వినియోగదార్లకు రూ.2,418 కోట్లను కేటాయించారు.



వైద్యానికి తగ్గిన నిధులు

బడ్జెట్లో వైద్యరంగానికి రూ.11,468 కోట్లను కేటాయించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వైద్యానికి రూ.12,378 కోట్లను కేటాయించింది. ఈ మేరకు రూ.910 కోట్ల మేరకు నిధులకు కోత పెట్టారు. నూతన వైద్య కళాశాలల్లో సిబ్బందిని నియమించాల్సి వుంది. పలు జిల్లాల్లో ఇంకా నిర్మాణంలోనే మెడికల్ కాలేజీలున్నాయి. వీటికి అవసరమైన నిధులను కేటాయించి భవన నిర్మాణాలను పూర్తి చేయాల్సి వుంది.

నీటిపారుదలకు తగ్గిన నిధులు

నీటిపారుదల శాఖకు నిధులను తగ్గించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదుల ప్రాజెక్టు రెండో దశ, మూడో దశ పనులతోపాటు కంతనపల్లి బ్యారేజీ పరిధిలో పలు పనులను పూర్తి చేయాల్సి వుంది. ఈ పనులు పూర్తి చేయడానికి నిధులు కేటాయించాల్సి వుంది. గత ప్రభుత్వం నీటిపారుదల రంగానికి రూ.26,808 కోట్లు కేటాయిస్తే, తాజా బడ్జెట్లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.22,301 కోట్లు కేటాయించింది.

42 వేల ఇందిరమ్మ ఇండ్లు

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో తొలి ఏడాది నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసింది. ఈ పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను 42 వేల ఇందిరమ్మ ఇండ్లు రానున్నాయి. లబ్దిదారులకు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు రూ.6 లక్షల ఆర్థిక సాయం చేస్తారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం గమనార్హం. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గృహ నిర్మాణానికి రూ.11,000 కోట్లను కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించినా, నిధులను కేటాయించలేదు.

త్వరలో 'డబుల్స్' పంపిణీ..

ఇప్పటికే గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు పూర్తయినవాటిని త్వరలోనే లబ్దిదారులకు పంపిణీ చేయనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సిఎం తెలిపారు. అసంపూర్తిగా వున్న ఇండ్లను కూడా పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తామని చెప్పడంతో పేదవర్గాల్లో హర్షం వ్యక్తమవుతుంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అంబేద్కర్నగర్లో డబుల్ బెడ్రూం ఇండ్లు పూర్తయి వున్నాయి. వీటి పంపిణీ కోసం పేదలు ఎదురుచూస్తున్నారు. వరంగల్ తూర్పు, వర్ధన్నపేట తదితర నియోజకవర్గాల్లో పూర్తి చేసిన డబుల్ బెడ్రూం ఇండ్లను గత ప్రభుత్వం లబ్దిదారులను ఎంపిక చేసి పంపిణీ చేయలేదు. త్వరలోనే పూర్తయిన డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించడం పట్ల నిరుపేదల్లో హర్షం వ్యక్తమవుతుంది. పలు నియోజకవర్గాల్లో అసంపూర్తిగా వున్న డబుల్ బెడ్రూం ఇండ్లను కూడా పూర్తి చేసి, మౌళిక వసతులు కల్పించి ఇస్తామని ప్రకటించడం గమనార్హం.

చినుకు పడితే కార్యాలయమంతా చిత్తడే

ఈజీఎస్ భవన పై కప్పుకు చిల్లులు

తడిసి ముద్దవుతున్న రికార్డులు..

అవస్థలు పడుతున్న ఉపాధి సిబ్బంది

భయాందోళనకు గురవుతున్న ఉద్యోగులు

మరమ్మత్తు చేయించాలని మొర

నవతెలంగాణ-ఖానాపురం

గ్రామీణ ప్రాంత ప్రజలకు 100రోజులు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన భవనం శిథిలావస్థకు చేరుకొని పై స్లాబ్ చిల్లులు పడడంతో గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కార్యాలయంలోకి నీరు చేరి విలువైన కార్యాలయ రికార్డులు, డాక్యుమెంట్లు, ఎంబీలు, కంప్యూటర్లు ఇతర సామాగ్రి తడిసి ముద్దవుతున్న ఘటన మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..

మండలంలోని ఉపాధి హామీ భవనం గత కొద్ది సంవత్సరాల క్రితం నిర్మించబడింది. సంవత్సరాలు గడుస్తున్న కొద్ది భవనానికి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టకపోవడంతో స్లాబ్ పైభాగం చిల్లులు పడింది. చిన్న చినుకు పడిన కార్యాలయం చిత్తడిగా మారుతుంది. గత కొద్దిరోజులుగా మండలంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భవనం నుండి నీరు లీకేజీ రూపంలో కారడంతో కార్యాలయంలో భద్రపరిచిన కార్యాలయ రికార్డులు, కంప్యూటర్లతో సహా ఇతర సామాగ్రి తడిసి ముద్దవుతుంది అని కార్యాలయ సిబ్బంది వాపోతున్నారు. ఉపాధి హామీ సేవల కొరకు తరలివచ్చే ప్రజల సైతం భవన పెచ్చులు ఊడి మీద పడి ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఉన్నందున భయభ్రాంతులకు గురవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహించే ఉపాధి హామీ సిబ్బంది కార్యాలయంలో ఉండాల్సిన పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో ఎక్కడ ఏ ప్రమాదం వాటిల్లునో అని భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కార్యాలయాన్ని వేరొక చోటకు మార్చాలని లేదా.. చిల్లులు పడిన భవనానికి తాత్కాలిక మరమ్మత్తులు చేపించాలని ఉద్యోగులు వేడుకుంటున్నారు.





వర్షాకాలంలో విధులు నిర్వర్తించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం : వావిల్ల ప్రసాద్ కుమార్(జిల్లా సాంకేతిక సహాయకుల సంఘ అధ్యక్షులు ఖానాపురం)



ఉపాధి హామీ భవనంలో వర్షాకాలంలో విధులు నిర్వర్తించాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పనులు చేపించిన ఎంబీలను కార్యాలయంలో భద్రపరిచాం. ఇటీవల కురిసిన వర్షాలకు ఆఫీస్ రికార్డులతో సహా ఎంబీలు తడిసి ముద్దగా మారాయి. తడిసిన స్లాబ్ పెచ్చులు ఊడి మీద పడే ప్రమాదం ఉంది. పెను ప్రమాదం వాటిల్లకముందే అధికారులు తాత్కాలీక మరమ్మత్తులు చేపట్టాలి.

కార్యాలయాన్ని వేరే భవనానికి మార్చుతాం : ఎంపీడీవో ఈగల భారతి



వర్షాల కారణంగా ఉపాధి హామీ భవనం కురుస్తుండడం వాస్తవమే. కార్యా లయంలో భద్రపరిచిన ముఖ్యమైన రికార్డులను మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి తర లిస్తాం. ఉపాధి హామీ కార్యాలయాన్ని పక్కనే ఉన్న హౌసింగ్ బిల్డింగ్ లోకి తరలించేందుకు ఆలోచన చేస్తున్నాం. అతి త్వరలో నిర్ణయం తీసుకొని కార్యాలయాన్ని వేరే భవనానికి మార్చుతాం.

చట్టాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలి

చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్

నవతెలంగాణ-ములుగు

చట్టాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. ములుగు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అబ్బాపురం గ్రామ శివారులోని వ్యవసాయ రైతు కూలీలతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేందర్ పాల్గొని మాట్లాడుతూ దుక్కి దున్నే నాటి నుండి పండించిన పంటను మార్కెట్లో అమ్మేదాకా వ్యవసాయానికి సంబంధించి పలు చట్టాల గురించి వివరించారు. ఉచిత న్యాయం, వివిధ హక్కులకు సంబంధించిన చట్టాల గురించి రైతు కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సిల్ రాచర్ల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని వ్యతిరేకించి లౌకికతత్వాన్ని కాపాడుకుందాం

- వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు

నవతెలంగాణ-కాశిబుగ్గ

దేశంలో మతోన్మాదాన్ని వ్యతిరేకించి లౌకికతత్వాన్ని కాపాడుకోవాలని వామపక్ష నాయ కులు పిలుపునిచ్చారు. గురువారం శివనగర్ ఏసి రెడ్డి నగర్లోని రఘునాథ్ భవన్లో సీపీఐ(ఎం), ఎంసీపీఐ(యు), సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, మాస్లైన్, తదితర వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంసీపీఐ (యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సీపీఐ(ఎం) నాయకులు సింగారపు బాబు, న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, మాస్లైన్ నాయకులు చిర్ర సూరిలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య, ఎంసీపీఐ యు రాష్ట్ర నాయకులు గోనె కుమారస్వామి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గంగుల దయాకర్ మాట్లాడారు. భారతదేశంలో అనేక కులాలకు మతాలకు, భాషలకు, సాంస్కతి సాంప్రదాయాలకు ఆచార వ్యవహారాలకు నిలయమైన భిన్నత్వంలో ఏకత్వం గల ప్రజాస్వామ్య దేశం అన్నారు. భారతదేశం ఏనాడు హిందూ దేశంగా లేదన్నారు. స్వాతంత్ర పోరాటం తర్వాత కొన్ని దేశాలు మతాలుగా విడిపోయినప్పటికీ భారతదేశం మాత్రం లౌకిక దేశంగా ఇప్పటికి కొనసాగుతుందన్నారు. కానీ భారతీయ జనతా పార్టీ దాని అనుబంధ సంఘాలైన ఆర్ఎస్ఎస్, వీహెచ్పీ, బజరంగ్ దళ్ తదితర మత సంస్థలన్నీ ఈ దేశాన్ని హిందూ మాత దేశంగా ఉండేలా తయారు చేయాలని లౌకిక తత్వాన్ని దెబ్బ తీయాలని కుట్రలు పన్నుతూ ప్రజల మధ్య అనైక్యతను సష్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు అన్ని మతాల ప్రజలు సోదర భావంతో జీవిస్తున్నారని మతాల అంతిమ లక్ష్యం సర్వమతాల సామరస్యతే భారతీయతగా ఉండాలని కోరారు. మతాలు వ్యక్తిగతమైన విశ్వాసాలకు సంబంధించినవని, అవి రాజ్యాంగానికి మతానికి లింకు పెట్టి ప్రజల మధ్య అనైక్యతను సష్టించే మతోన్మాదుల పార్టీలకు సంస్థలకు తగిన విధంగా బుద్ధి చెప్పి రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని లౌకిక తత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత లౌకిక శక్తులపై ఉందని, దానికి తగిన విధంగా కార్యాచరణ రూపొందించుకొని ముందుకు పోయేలాకషి చేయాలన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, నలిగంటి రత్నమాల, వలదాసు దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.




రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ మొండి చేయి

కాంగ్రెస్ నాయకుల నిరసన

నవతెలంగాణ-నల్లబెల్లి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేటాయించకుండా రాష్ట్రానికి మొండి చేయి చూపించారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో గురువారం తెలంగాణ రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, శేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, ఉపాధ్యక్షుడు కొమరారెడ్డి, మండల కార్యదర్శి మామిండ్ల కొమురెల్లి, జెట్టి మూర్తి, బత్తిని మల్లయ్య, పురుషోత్తం సురేష్, సంపత్ రెడ్డి, కొండ్ల అశోక్, బత్తిని మహేష్, తదితరులు పాల్గొన్నారు.



తురక కాశోల్లాలను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లను కేటాయించాలి.

అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థికసాయం అందించాలి

టీకేఎస్ఎస్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ వలీ



నవతెలంగాణ-ఆత్మకూరు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమానికి రూ.3003 కోట్లు కేటాయించింది. వేల కోట్ల డబ్బు మైనారిటీల్లో అత్యంత వెనుకబడిన తరగతుల్లో ఉన్న కులవృత్తిని నమ్ముకున్న వారికి అందడం లేదని తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ వలీ ఆవేదన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆయన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా మా కాశోల్లాల జీవితాలు మారడం లేదని సయ్యద్ వలీ ఆవేదన వ్యక్తంచేశారు. కాశోల్లాలు గుట్టల్లో కొండల్లో ఉంటూ విద్యా, వైద్యం , ఆర్థిక, సామాజిక దూరంగా దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారన్నారు. సరైన మౌళిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాకు సామాజిక న్యాయం, ఆర్థికాభివృద్ధికై తురక కాశ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో గత ఏడు సంవత్సరాలుగా గత ప్రభుత్వాల చుట్టూ ప్రదక్షిణలు చేశాం కాని ఫలితం శూన్యమన్నారు. ప్రభుత్వాలు మైనారిటీల సంక్షేమ కోసం రూ.వేల కోట్లు కేటాయించినామైనార్టీల్లో ఉన్న కులవృత్తులను నమ్ముకున్న కటిక నిరుపేదలకు చిల్లి గవ్వ అందకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వంలా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తురక కాశోల్లాలకు ప్రత్యేక పేడరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు కేటాయించి అర్హులైన వారికి లోన్స్ వంద శాతం సబ్సిడీతో 500 కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిఎడల రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిగా ఉన్న కాశోల్లాలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ప్రభుత్వాన్ని సయ్యద్ వలీ హెచ్చరించారు.

సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు..

సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. జరిగింది. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్ విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు మన మన ఊరు మనబడి పథకంతో నాణ్యమైన విద్యను, అన్ని సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఆచరణలో నిధులు కేటాయించకపోవడం లేదని, విద్యా రంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగాప్రభుత్వం విఫలమైందన్నారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలే కాంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు విద్యార్థులకు కనీస వసతులైన త్రాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, గ్రౌండ్, లైబ్రరీ క్రీడా సామాగ్రి, స్కావెంజర్లు లేకుండా పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువులను ఎలా కొనసాగిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వాలు గుర్తించాలని, వారి చదువులను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే ప్రభుత్వం దృష్టికి విద్యార్థుల పలు సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో టౌన్ సెక్రటరీ రాకేష్, జిల్లా నాయకులు రాజేష్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు తగ్గట్టుగా బడ్జెట్ కేటాయింపులు లేవు

సీపీఐ(ఎం) లింగయ్య




నవతెలంగాణ-ఐనవోలు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన గ్యారంటీలు వాగ్దానాల అమలుకు తగ్గట్టుగా బడ్జెట్ కేటాయింపులు లేవని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, పెన్షన్, రూ.నాలుగు వేలకు పెంచుతామని, మహిళలకు రెండు వేల ఐదు వందల రూపాయల చొప్పున ఇస్తామని, కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పిన హామీలు బడ్జెట్‌లో కనీస ప్రస్తావన కూడా లేదన్నారు. వ్యవసాయ రంగానికి. పశుసంవర్ధక శాఖకు, ఎస్సీ ఎస్టీలకు బడ్జెట్ పెంచారు. కాని ఖర్చు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గృహ నిర్మాణానికి పెంచినవి సరిపోవు కేటాయింపులు పెంచి ఇల్లు లేని పేదలందరికీ గృహ వసతి కల్పించాలని ఆయన కోరారు. ముఖ్యమైన రంగాలైన విద్య, వైద్యంకు పెద్దగా కేటాయింపుల్లో మార్పు లేదని, యూనివర్సిటీ లు ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఆయనన్నారు. అలాగే హనుమకొండ జిల్లా కు అండర్ డ్రైనేజీ, రింగ్ రోడ్డు, హైదరాబాద్ వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ లాంటివి ప్రభుత్వం విస్మరించిందన్నారు. తెలంగాణలో అతిపెద్ద 2వ నగరమైన వరంగల్ నగర అభివృధికి నిధుల సరైన కేటాయింపులు చేయకుండా, హైదరాబాద్ అభివృద్ధికు మాత్రమే నిధులు కేటాయించారన్నారు. ఆర్థిక వనరుల సమీకరణకు కేంద్రంపై అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ప్రభుత్వం పోరాడాలని ఆయన కోరారు.

రెడ్డి సంఘం మండల ఉపాధ్యక్షుడిగా అయ్యల రామ్ రెడ్డి నియామకం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



రెడ్డి సంఘం హసనపర్తి మండల ఉపాధ్యక్షునిగా గ్రేటర్ కార్పొరేషన్ 65వ డివిజన్ కు చెందిన అయ్యాల రామ్‌రెడ్డిని నియమించడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి సంఘం ఉపాధ్యక్షులుగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు గోపు జైపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు అర్జుల కిషన్ రెడ్డి, మండల అధ్యక్షులు వీసం సురేందర్ రెడ్డి, తన నియమానికి సహకరించిన వారందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. రెడ్డి సంఘం అభివృద్ధికి పేదరెడ్డి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

అభ్యసన సామర్థ్యాల పెంపు కోసం ఉపాధ్యాయ శిక్షణ

డీఈవో మహ్మద్ అబ్దుల్ హై



నవ తెలంగాణ/హనుమకొండ:

అభ్యసన సామర్థ్యాల పెంపు కోసం ఉపాధ్యాయ శిక్షణలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీఈవో మహ్మద్ అబ్దుల్ హై అన్నారు.గురువారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లష్కర్ బజార్‌లో జరిగిన రిసోర్స్ టీచర్ల ప్రణాళిక సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ హై మాట్లాడారు. జిల్లాలో ఒకటి నుండి 10వ తరగతి విద్యార్థుల వరకు అభ్యసన సామర్థ్యాలు పెంపే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని, ఈ నెలలో జిల్లా స్థాయి రిసోర్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 తేదీలలో జిల్లాస్థాయి శిక్షణల ఉంటాయని , 31 నుండి ఆగస్టు రెండవ తేదీ వరకు కాంప్లెక్స్ స్థాయిలో శిక్షణలు ఉంటాయని తెలిపారు. జిల్లా స్థాయి శిక్షణల అనంతరం, పాఠశాల సముదాయ (స్కూల్ కాంప్లెక్స్) సమావేశాలలో శిక్షణలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుణాత్మక విద్య సమన్వయకులు ఏ. శ్రీనివాస్, జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాస స్వామి, స్టేట్ రిసోర్స్ టీచర్లు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడం లో కాంగ్రెస్ పార్టీ దేశానికే ఆదర్శం

సీనియర్ కాంగ్రెస్ నాయకులు వీరమల్ల రంజిత్ రెడ్డి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

రైతులకు అండగా నిలబడే బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సీనియర్ పార్టీ కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరమల్ల రంజిత్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ గురువారం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి రూ.72 వేల 659 కోట్లు కేటాయించారు. తెలంగాణ బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో దేశానికే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. గతంలో కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు పదేళ్ళుగా రైతులను ఏ విదంగా మోసం చేశాయో తెలిసిందేనన్నారు. ఈ బడ్జెట్ లో ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం అంటే ఇందిరమ్మ రాజ్యం లోనే రైతుకు భరోసా అని మరోసారి నిరూపితమైందన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలి..



కార్మిక చట్టాలను అమలు చేయాలి

మున్సిపల్ కార్మికులకు రూ.26 వేలు ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్

నవతెలంగాణ-హసన్‌పర్తి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించి అమలు చేయాలని, మున్సిపల్ పారిశుద్య కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం శుభమస్తు ఫంక్షన్ హాలులో రేణికుంట్ల సురేష్, శ్రీలత, ఎస్.రాజు అధ్యక్షతన జరిగిన విలీన గ్రామాల మున్సిపల్ వార్డుల మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పది సంవత్సరాల పాలనలో కార్మిక, వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. కార్మిక చట్టాల్ని రద్దుచేసి, బడా పెట్టుబడిదారులకు కార్మికుల్ని బానిసలుగా మారుస్తూ కార్పొరేట్లకు కొమ్ముగాసి, కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడిందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు ఏమి ఇవ్వలేదన్నారు. విభజన హామీలైన కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, హైదరాబాద్ టు విజయవాడ బుల్లెట్ రైల్వే ప్రాజెక్టుకు నిధులు కేటాయించాల్సి ఉండగా కనీసం వాటి గురించి మాట్లాడందం చేయలేదని విమర్శించారు. ఇప్పటికైన విభజన హామీలను అమలు చేయాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయకుండా, కనీస వేతనాలు అమలు చేయకుండా, కార్మికుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమడుతుందని మండిపడ్డారు. కనీసం ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్టు రూ.21 వేల వేతనాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలకవర్గాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేవిధంగా చైతన్యం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం హసన్‌పర్తి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రేణిగుంట్ల సురేష్, కార్యదర్శిగా నాగరాజ్, సంగాల రాజు, కోశాధికారిగా సంగాల సందీప్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పుల్ల అశోక్, గౌరవ అధ్యక్షుడిగా బరుపట్ల మహేష్, గౌరవ సలహాదారుగా, ఉపాధ్యక్షులుగా బిక్షపతి, లక్ష్మణ్, ప్రణయ్, సుజాత, సహాయ కార్యదర్శులుగా రోహిత్, సుధాకర్, శ్రీలత, సునీల్‌తో పాటు మరో 13 మందిని కమిటీ సభ్యులుగా మొత్తం 27 మందితో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు.



బంధం చెరువు మత్తడి ధ్వంసం..

ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలోని బంధం చెరువు మత్తడిని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసం చేసిన వారిని గుర్తించి తగిన శిక్ష విధించాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు. బంధం చెరువు మత్తడి పై లేయర్ ప్రతీ వర్షాకాలం ఊడిపోతు బందం చెరువు లో నీరు వృధాగా పోతుంది. ఈ విషయాన్ని నీటి పారుదల శాఖ, గ్రామ అధికారులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టిం చుకోవడం లేదని రైతులు వాపో తున్నారు. చెరువు మత్తడి సరిగా ఉంటే వేసవి కాలంలో కూడా తూముల ద్వారా వేల ఎకరాల్లో వరి పంటల సాగు అవుతుందని, బంధం చెరువు ఎండిపోతే పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ అధికారులు పట్టించుకోకపోవడంతో గత ఏడాది అధిక వర్షాలతో మత్తడి ధ్వంసం కాగా ఆయకట్టు రైతులు వలుగుల ప్రభాకర్, అనంతుల అశోక్, మోరె నాగరాజు, ఐలి వెంకటేశ్వర్లు, నరెడ్ల అఖిల్, లక్కర్సు కవిరాజు లు స్వచ్ఛంధంగా సొంత ఖర్చులతో మట్టి పోసి శ్రమదానం చేసి మరమ్మత్తులు చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులోకి సమృద్ధిగా నీరు చేరిందా అని చూద్దామని రైతులు వలుగుల ప్రభాకర్ తో పాటు మరికొందరు కలిసి వెళ్లి చూడగా, మత్తడి ప్రదేశం ధ్వంసం అయి నీరు వృధాగా పోతుండడంతో రైతులు కంగుతిన్నారు. చెరువు మత్తడిని ధ్వంసం చేసిన వారిని గుర్తించి తగిన శిక్ష వేయాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు. గత ప్రభుత్వాలు చెరువులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోని చెరువు మత్తడి కట్టిస్తే సాగునీటి సమస్య తొలగిపోతుందని రైతులు కోరుతున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో.. తెలంగాణకు నిధులు కేటాయించాలి

తెలంగాణపై ఎన్‌డీఏ వివక్షత నశించాలి

అంబేద్కర్ సెంటర్‌లో వీసీకే, ప్రజాసంఘాల నిరసన, ధర్నా



నవతెలంగాణ-నయీంనగర్

వికసిత్ భారత్ తో మూడవ సారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ తెలంగాణకు ఒక్క రూపాయి కేటాయించలేదని, తక్షణమే తెలంగాణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ విముక్త చిరుతల కచ్చి(వీసీకే) ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ లో గురువారం నిరసన, ధర్నా చేశారు. వీసీకే వరంగల్ జిల్లా అధ్యక్షుడు కన్నాల రవి అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో వీసీకే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఎనిమిది సీట్లు బీజేపీకి ఇచ్చారని, బిజెపి మాత్రం రిటర్న్ గిఫ్ట్ గా తెలంగాణకు బడ్జెట్ లో గుండుసున్నా ఇచ్చిందని విమర్శించారు. ఈ అన్యాయానికి నైతిక బాధ్యత వహిస్తూ తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు రాజీనామ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర బుడ్జెట్‌పై తెలంగాణ అసెంబ్లీలో జరిగిన చర్చకు సమాధానం చెప్పలేక తెలంగాణ అసెంబ్లీ నుండి బిజెపి ఎమ్మెల్యేలు వాకౌట్ చేసి ముఖం చాటేశారని ఆయన విమర్శించారు. దక్షణాది ఆత్మగౌరవ వేదిక రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేశారని ఆరోపించారు. మోదీ కుర్చీని కాపాడుకోవడానికి బీహార్, ఏపీ లకు మాత్రమే నిధులు కేటాయించారని, ఇది దక్షిణాది వ్యతిరేక బడ్జెట్ అని క్రాంతి కుమార్ విమర్శించారు. బీసీ ఓట్లతో గద్దెనెక్కిన మోడీ బడ్జెట్ లో బీసీలకు జనాభా ప్రకారం నిధులు కేటాయించకుండా, బీజేపీ బీసీ లకు తీవ్ర అన్యాయం చేసిందని, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు ఎవరూ బీజేపీకి ఓటు వేయద్దని ఆయన పిలుపునిచ్చారు. దళిత, గిరిజనులకు నిధులు కేటాయించని బడ్జెట్‌ను దళిత బహుజన ఫ్రంట్ వ్యతిరేకిస్తుందని, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వీసీకే రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చ దేవేందర్, వీసీకే నాయకులు మచ్చ విశ్వతేజ, వినయ్, బీసీ నాయకులు సూరం నిరంజన్, న్యాయ తవాదులు రంజిత్ గౌడ్, ఎగ్గడి సుందర్ రామ్, జెజ స్వామిలు పాల్గొన్నారు.

లోన్ పాలసీ మార్గదర్శకాలపై సమీక్ష

నవతెలంగాణ-నయీంనగర్



వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అధ్యక్షతన గురువారం వరంగల్ డీసీసీ బ్యాంక్ (ఎల్‌పీఎంసీ) పాలసీ మేకింగ్ కమిటీ సమావేశం డీఎల్ఎం ఆర్ సి డిస్ట్రిక్ లెవెల్ మానిటరింగ్ అండ్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్నేని రవీందర్ రావు లోన్ పాలసీ మార్గదర్శకాలపై, విద్య రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, డిపాజిట్స్ పై వారు అధికారులతో సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ వేంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు జగన్ మోహన్, చాపల యాదగిరి, మురళీ, డిసిఓ నాగేశ్వర రావు, సీఈఓ వజీర్ సుల్తాన్, జీఎం ఉషాశ్రీ, టీఎస్ సీఏ బి నోడల్ ఆఫీసర్ లత, నాబార్డ్ డిడిఎం చంద్ర శేఖర్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలుకు తగ్గట్టుగా రాష్ట్ర బడ్జెట్ లేదు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి



నవతెలంగాణ-నయీంనగర్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన గ్యారంటీలు, వాగ్దానాల అమలుకు తగ్గట్టుగా బడ్జెట్ కేటాయింపులు లేవని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, పెన్షన్, రూ.నాలుగు వేలకు పెంచుతామని, మహిళలకు రూ.2500 చొప్పున ఇస్తామని, కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పిన హామీలు బడ్జెట్‌లో కనీస ప్రస్తావన కూడా లేదన్నారు. వ్యవసాయ రంగానికి ఎస్సీ, ఎస్టీలకు బడ్జెట్ పెంచారు కాని ఖర్చు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గృహ నిర్మాణానికి పెంచినవి సరిపోవని, కేటాయింపులు పెంచి ఇల్లు లేని పేదలందరికీ గృహ వసతి కల్పించాలని ఆయన కోరారు. ముఖ్యమైన రంగాలైన విద్య, వైద్యంకు పెద్దగా కేటాయింపుల్లో మార్పు లేదని, యూనివర్సిటీలు, ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో మౌళిక వసతులు కల్పించాలన్నారు. అలాగే హనుమకొండ జిల్లాకు అండర్ డ్రైనేజీ, రింగ్ రోడ్డు, హైదరాబాద్ వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ లాంటివి ప్రభుత్వం విస్మరించిందన్నారు. తెలంగాణలో అతిపెద్ద 2వ నగరమైన వరంగల్ నగర అభివృధికి నిధుల సరైన కేటాయింపులు చేయకుండా, హైదరాబాద్ అభివృద్ధికి మాత్రమే నిధులు కేటాయించారన్నారు. ఆర్థిక వనరుల సమీకరణకు కేంద్రంపై అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ప్రభుత్వంపై పోరాడాలని ఆయన కోరారు.



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి

కేంద్ర బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసిన సీపీఐ నాయకులు

నవతెలంగాణ-ఎల్కతుర్తి..

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా ఇచ్చిన సందర్భంగా, సీపీఐ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలి వద్ద బడ్జెట్ పత్రాలు దగ్ధం చేశారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మండల కార్యదర్శి ఊట్కూర్ రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు సవతి తల్లి ప్రేమ చూపించారన్నారు. దీనికి కేంద్ర మంత్రులు తెలంగాణకు నిధులను తేవడంలో విఫలమయ్యారన్నారు. దీనికి నైతిక బాధ్యత వారు భరించవలసిందేనన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం ప్రజలు చెప్తారన్నారు. బీజేపీకి వత్తాసు పలికిన ఆంధ్రప్రదేశ్, బీహార్‌ల కు బీజేపీ అమ్ముడు పోయిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రే లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు మర్రి శ్రీనివాస్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి శనిగరపు రాజ్ కుమార్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు తండా మొండయ్య, నిర్మల, మనోహర్, మర్రి విజయ్, సుర మొగిలి, పిన్ రెడ్డి మోహన్ రెడ్డి, గుంత మల్లయ్య, భాస్కర్ రెడ్డి, ఇంజాల పోచయ్య, జూపాక రవీందర్, పెండ్యాల ఐలయ్య, పి.రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-హసన్‌పర్తి

హన్మకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో గల సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 26, 27వ తేదీలలో స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు టీజీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ వరంగల్ వెస్ట్ ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి తెలిపారు. ఈ నెల 26వ తేదీన బాలికలకు, 27వ తేదీన బాలురకు మడికొండ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్‌లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పాట్ అడ్మిషన్‌ల సమయంలో బాలురు బాలుర కళాశాలలో, బాలికలు బాలికల కళాశాలలో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేసి అడ్మిషన్‌లు పొందాలని ఆమె కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

ఎంపీవో కర్ణాకర్‌రెడ్డికి జీపీ సంఘాల సన్మానం

నవతెలంగాణ-హసన్‌పర్తి



హసన్‌పర్తి మండల పంచాయతీ అధికారిగా నియమితులైన కర్ణాకర్‌రెడ్డిని గురువారం కారోబాల్, బిల్ కలెక్టర్ల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఎంపీవోను కలిసిన వారిలో చాతళ్ల సదానందం, తగరం శివతో పాటు నాయకులు పాల్గొన్నారు.



ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ- ఆత్మకూరు

ఆత్మకూరు పోలీస్ స్టేషన్ కు ఇటీవలే నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై ప్రవీణ్ ను మండలంలోని హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ ఖాసిం, యూత్ అధ్యక్షుడు సయ్యద్ షరీఫ్ లు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE PRL DISTRICT JUDGE AT : BHONGIR
A.S.No.14 OF 2023

Between:
Arelli Sandhya Rani ...Appellant
AND
Mudagoni Swaroopa & Others ...Respondents

To,
ముదగోని స్వరూప భర్త: కీ.శే. రాజు, వయస్సు:54 సం॥లు, వృత్తి: రిటైర్డ్ రైల్వే ఉద్యోగి, నివాసం: ముల్కనూరు గ్రామం సహకార్ సూపర్ బజార్ ఎదురుగా, భీమదేవరపల్లి మండలం హన్మకొండ జిల్లా పిన్-505497.

పైన తెలిపిన కక్షిదారునకు తెలియజేయునది ఏమనగా మీ పైన ప్రిన్సిపల్ జిల్లా కోర్టు నందు ఎ.సంధ్యారాణి అప్పీల్ కేసు వేయడం జరిగింది. అట్టి కేసు నెం. A.S.No.14 OF 2023 అట్టి కేసు 08.08.2024 నాడు కలదు. అట్టి కేసుకు మీరు కానీ మీ తరఫున న్యాయవాది కానీ హాజరుకాగలరు. లేని యెడల అట్టి కేసు మీకు వ్యతిరేకంగా రాగలదు.

(కోర్టువారి అనుమతితో)
ఎం.ఎ.రహీం,
కె.మల్లేశం,ఎం.డి.వసీం
అడ్వకేట్స్, భువనగిరి.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ARB.NO. 450 OF 2024

Between:
M/s.Margadarsi Chit Fund Pvt. Ltd., Warangal Branch ...Disputant
And
Mr.SUTRAPU SATISH & Others ...Opponents

To

Opp.No.2 SUTRAPU GOPINATH, S/o.Rajender, Age: 31 Years, W/as. Agriculture Extension Officer at Chityal, O/o. A.D.A (R), Bhupalpally Division, Bhupalpally, Dist: Jayashankar Bhupalpally. R/o. H.No. 20-437, Mamatha Nagar, Parkal, Dist: Hanamkonda.

Opp.No.4 Mr. VALABOJU SRINIVAS, S/o. Rama Brahma Chary, Age: 48 Years, Prop: M/s. Venkateshwara Jewellary Mart, Srinivasa Complex, R.N.T Road, Warangal. R/o.H.No. 1-9-1199, Near Ganapathi Temple, Hunter Road, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money, suit claim of **Rs.12,22,365/-** several times notices were issued to you. But you have failed to receive the same the above dispute is posted on **09-08-2024** for your appearance on that day you have to appeare in person at **11.00 AM** Before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-partee.

Sd/-
DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR - WARANGAL.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ARB.No. 453 OF 2024

Between:
M/s.Margadarsi Chit Fund Pvt. Ltd., Warangal Branch ... Disputant
And
Mr.SUTRAPU SATISH & Others ... Opponents

To

Opp.No.5. KASTHURI SWARUPA, W/o. K.Sathish, Age: 41 Years, Prop: M/s.Glama Zone Salon Mens Parlour, Jakotia Ground Shopping Mall, Pochammamaidan, Warangal, Dist: Warangal. R/o.H.No.3-4-361, New Rayapura, Hanamkonda, Dist: Hanamkonda.

Opp.No.6. SUTHRAPU GOPINATH, S/o.S.Rajendar, Age: 32 Years, W/as.Agriculture Extension Officer at Chityal, O/o.A.D.A (R), Bhupalpally Divn. Bhupalpally, Dist; Jayashankar Bhupalpally. H.No.20-437, Mamatha Nagar, Parkal, Dist: Hanamkonda.

Opp.No.7. KASTHURI SATHISH, S/o. Venkataiah, Age: 47 Years, Property Holder, R/o.H.No.3-4-361, New Rayapura, Hanamkonda, Dist: Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money, suit claim of **Rs.6,07,408/-** several times notices were issued to you. But you have failed to receive the same the above dispute is posted on **09-08-2024** for your appearance on that day you have to appeare in person at **11.00 AM** Before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-partee.

Sd/-
DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR - WARANGAL.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ARB.No. 457 OF 2024

Between:
M/s.Margadarsi Chit Fund Pvt. Ltd., Warangal Branch ...Disputant
And
MS.REBELLI SRIDEVI & Others ...Opponents

To

Opp.No.4. NELLUTLA RAGHUVEER, S/o. N.Sheshagiri Rao, Age: 61 Years, Prop: M/s.Sri Sairam Welfare Stores, Ram nagar, Hanamkonda, Dist: Hanamkonda. R/o.H.No.2-2-483, Ramnagar, Hanamkonda, Dist: Hanamkonda.

Opp.No.5. NADDUNOORI BHAGYA LAXMI, W/o.N.Shanker, Age: 54 Years, W/as.P.H Worker, O/o. Addl.Commissioner, G.W.M.C., Hanamkonda, Dist: Hanamkonda. R/o.H.No.6-1-102, Kancharakunta, Hanamkonda, Dist: Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money, suit claim of **Rs.3,03,070/-** several times notices were issued to you. But you have failed to receive the same the above dispute is posted on **09-08-2024** for your appearance on that day you have to appeare in person at **11.00 AM** Before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-partee.

Sd/-
DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR WARANGAL.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.No. 456 OF 2024

Between:
M/s.Margadarsi Chit Fund Pvt. Ltd., Warangal Branch ... Disputant
And
Mr.PARAKALA VENKATESHWARLU & Others ... Opponents

To

Opp.No.1. PARKALA VENKATESH WARLU, S/o. P.Rajamallu, Age: 50 Years, Occ: Agriculturist & Real Estate Business, Vennampally, Mdl: Saidapur, Dist: Karimnagar. R/o.H.No.55-2-375/A, Vidyaranyapuri, Bheemaram, Bank Colony,Hanamkonda,Dist:Hanamkonda.

Opp.No.2. BOCHU PRASADA RAO, S/o. B.Saraiah, Age: 46 Years, W/as. School Asst., (Emp.ID: 2148846) Govt High School, Mahabubabad, Mahabubabad. R/o.H.No.2-2-198, Naimnagar, Hanamkonda. Dist : Hanamkonda,

Opp.No.4. MADASI SATHISH, S/o. M.Rajaiah, Age: 38 Years, R/o.H.No.2-2-452, Kishanpura, Hanamkonda, Dist: Hanamkonda.

Opp.No.6. MOOLA KRISHNA PRASAD, S/o.M.Narayana, Age: 48 Years, Prop: M/s.Gayatrhri Agencies, Opp: Asian Mall, Hanamkonda, Dist: Hanamkonda. R/o.H.No.3-9-698/2/A, Reddy Colony, Hanamkonda, Dist: Hanamkonda.

Opp.No.7. NALLA LEELA ALIAS LEE LESHWARI, W/O.N.Laxmi Narayana, Age: 52 Years, Property Holder, R/o. H.No.6-6-A/15, Gopalpur Road, Sainagar Colony, Hanamkonda, Dist: Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money, suit claim of **Rs.4,26,350/-** several times notices were issued to you. But you have failed to receive the same the above dispute is posted on **09-08-2024** for your appearance on that day you have to appeare in person at **11.00 AM** Before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-partee.

Sd/- DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR - WARANGAL.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం జులై 26, 2024
www.navatelangana.com



'రాజు దేవుడే' సేవలు అభినందనీయం

జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శామ్యూల్

నవతెలంగాణ-భూపాలపల్లి

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజు దేవుడే సేవలు అభినందనీయమని జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు శామ్యూల్ తెలిపారు.భూపాలపల్లి జిల్లా వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు దేవుడేను ఇటీవల ప్రభుత్వం ములుగు జిల్లాకు బదిలీ చేసిన సందర్భంగా గురువారం మెడికల్ కళాశాలలో గెజిటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేవుడు ప్రాణం పోస్తే వైద్యుడు జీవం పోస్తాడని, విద్యార్థులకు విద్యతో పాటు అధ్యాపకులు జీవితాన్ని బోధిస్తారని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులు మంచిగా చదువుకొని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలకు 3.5.2023న ప్రథమ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యత చేపట్టిన రాజు దేవుడే సమర్థవంతంగా విధులు నిర్వహించారని అన్నారు. అనంతరం శాలువా పుష్ప గుచ్ఛంతో ప్రిన్సిపాల్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంజీవరావు, వైస్ ప్రెసిడెంట్ అవినాష్, ప్రచార కార్యదర్శి శ్రీనివాస్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను సందర్శన

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలం లోని ఎలికేశ్వరం గ్రామపం చాయతీ పరిధి కమ్యూనిటీ ప్లాంటేషన్ వనమహోత్సవంను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నరేష్ గురువారం సందర్శించడం జరిగింది. పండ్ల తోటల పెంపకంలో భాగంగా మహాదేవపూర్ లోని మామిడి ప్లాంటేషన్ పరిశీలించి రైతులకు, ఉపాధి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం మండల కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో వన మహోత్సవంకు సంబంధించిన ప్రగతిని తెలుసుకుని తొందరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె వెంకటేశ్వర్లు, ఏపీవో కే రమేష్, ఈసీ కె శ్రీనివాస్ పంచాయతీ సెక్రెటరీ గాయత్రి, ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి : ఎంపీడీఓ భాస్కర్

నవతెలంగాణ-గణపురం



మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని బుద్ధారం గ్రా మంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల ప ర్యావరణాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. దీంతో వర్షాలు సమృద్ధిగా పడ తాయన్నారు. ఈ వర్షాకాలంలో భారీ ఎత్తున గ్రామాలలో మొక్కలు నాటాల న్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణ్ కుమార్, పంచాయతీ కా ర్యదర్శి హేమంత్, ఫీల్డ్ అసిస్టెంట్ సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

పరశురాంపల్లిలో వైద్య శిబిరం

నవతెలంగాణ-గణపురం

గణపురం మండలం పరుశురాం పల్లి గ్రామంలో గురువారం చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్వాతి. ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు ఈగలు వాలిన పదార్థాలు తినవద్దన్నారు. నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి. ఎ స్వామి, గ్రామ కార్యదర్శి శరత్ చంద్ర, హెల్త్ సూపర్వైజర్, విజయలక్ష్మి, సిబ్బంది కృష్ణవేణి, ఏఎన్ఎం కళావతి, ఆశాలు మమత, కల్పన, ధనరేఖ, తదితరులు పాల్గొన్నారు.

సభ్యులకు సర్టిఫికెట్స్ అందజేత

నవతెలంగాణ-మహాదేవపూర్



మండలం కేంద్రంలోని ఝాన్సీ లక్ష్మీ భాయి మండల సమాఖ్య (మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఫెడరేషన్ మిల్లెట్ ప్రొడక్ట్ తయారీలో భాగంగా శిక్షణ పొందిన 30మంది మహిళా సంఘాల సభ్యులకు గురువారం సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మిల్లెట్స్‌తో తయారు చేసిన పదార్థాలు రాగి లడ్డులు,కేక్,చిరు ధాన్యాల స్వీ ట్స్, కారా పదార్థాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమం లో డిఆర్డిఓ నరేష్, నాబార్డ్ ఏజీఎం రవి కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సీడీపీఓ రాధిక, వెలుగు ఎన్జీవో సిఓ రజిత ఏపీఎం రవీందర్, సీసీలు ఎంఎస్ఏ, వీవోఏలు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి'

నవతెలంగాణ -కోల్‌బెల్ట్



కాలుష్య నివారణకు, వాతావరణ సమతుల్యానికి ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని భూపాలపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్ అన్నారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కే టికె-6 గని ఆవరణలో వృక్షారోహణ అభియాన్-2024, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం -2024 కార్యక్ర మంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పచ్చదనం లోపించడం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని, మొక్కలను పెంచడం ద్వారా వాటిని ఎదుర్కోవచ్చని సూచించారు. ఎస్ ఓ టు జీఎం వెంకటరామిరెడ్డి, ఏజెంట్ రాజశేఖర్, గని మేనేజర్ రామ్ భరోస్ మెహతా, అజ్మీర తుకారాం డిజిఎం(పర్సనల్), రవికుమార్ డిజిఎం (సివిల్), సీజే సురేఖ డీజీఎం (ఫైనాన్స్), ఎన్విరాన్మెంట్ అధికారి పోషమల్లు, ఏఐటీయూసీ నాయకులు మోట పలుకుల రమేష్, ఐఎన్‌టియుసి నాయకులు జోగ బుచ్చయ్య, డివై పిఎంలు రాజు, తదితరులు పాల్గొన్నారు.

కేటికే-5 లో మొక్కలు నాటిన గని మేనేజర్

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఏరియా జనరల్ మేనేజర్ ఆదేశానుసారం భూపాల పల్లి ఏరియా కేటికే -5 గని ఆవరణలో గురువారం గని మేనేజర్ జాకీర్ హుస్సేన్ మొక్కలు నాటారు. నేడు మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే వచ్చే భావితరాలను అవి రక్షిస్తాయని తెలిపారు. గని రక్షణ అధికారి చంద్రశేకర్‌రావు, పర్యావరణ అధికారి రమేశ్, సంక్షేమ అధికారి సందీప్, పిట్ సెక్రెటరీలు తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

నవతెలంగాణ-మహదేవపూర్




గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో అనేక గ్రామాల్లోని ఇండ్ల గోడలు కూలిపోగా గురువారం ఓ ఇల్లు కూలిపోయిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. అన్నారం గ్రామానికి చెందిన ములకల రాజేశ్వరి ఇల్లుతో పాటు ఇంటి పైకప్పు కూలిపోయింది. గురువారం ఉదయం వరుసగా కురుస్తున్న వర్షానికి రాజేశ్వరి ఇల్లు కూలింది. కూలి చేసుకొని జీవనం కొనసాగించే కుటుంబానికి ఇల్లు కూలిపోవడంతో నిలువ నీడలేకుండా పోయింది. అధికారులు తక్షణమే స్పందించి తాత్కాలిక మర మ్మత్తు తోపాటు కుటుంబానికి పునరావస కేంద్రంతో నిత్యవసర సరుకులను అందజేయాలని బాధితులు కలెక్టర్‌ను వేడుకుంటున్నారు. మరోవైపు ఇల్లు కూలిన సంఘటన పై రెవెన్యూ అధికారులు వచ్చి వివరాలు సేకరిస్తున్నారు.

నేడు కన్నెపల్లి పంప్ హౌస్, మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్‌కు

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుల రాక

నవతెలంగాణ-మహాదేవపూర్



నేడు మహాదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంప్ హౌస్, మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్‌కి రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ నాయకులు వస్తున్నట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం కన్నెపల్లి పంప్ హౌస్ చేరుకొని సందర్శిస్తారని, అనంతరం 11 గంటల ప్రాంతంలో మేడిగడ్డ బ్యారేజ్ వద్దకు చేరుకుంటారని అన్నారు. మండలంలోని టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పింఛన్ కోసం నిరీక్షణ ?

- మండల కార్యాలయం చుట్టూ వితంతువులు, వికలాంగుల ప్రదక్షణలు
- పెండింగ్‌లో 800 దరఖాస్తులు
- కొత్త ప్రభుత్వమైనా స్పందించాలని విజ్ఞప్తి

నవతెలంగాణ-మల్హర్‌రావు

వితంతువులు, దివ్యాంగులు పింఛన్ కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇక దివ్యాంగుల విషయంలో సదరం క్యాంపుల నుంచి సర్టిఫికెట్ తెచ్చుకున్నా ప్రభుత్వ వెబ్ సైట్ ఓపెన్ కాలేదని చెబుతున్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం అయినా పింఛన్ మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.



మండలంలో 15 గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 3,855 పింఛన్లు ఉన్నాయి. ప్రతి నెలా ప్రభుత్వం రూ.2,116లు పింఛన్ అంది స్తోంది. ప్రతి నెలా వివిధ గ్రామాల్లో వివిధ కారణాల వల్ల భర్తలు చనిపోవడంతో భార్యలు వితంతువులతున్నారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ పోషణ భారం భార్యలపై పడుతోంది. దీంతో పిల్లల చదువుల భారంతో పాటు కు టుంబ పోషణ వితంతువులకు కష్టంగా మారుతోంది. కొంతమంది చిన్న వయసులోనే భర్తను కోల్పోయి ఒంటరి జీవితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వితంతవులకు పింఛన్ రాక అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కరు నాలుగైదు ఏళ్ల నుంచి పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. పలుసార్లు మండల కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకపోయిందని అంటున్నారు. కొంత ఆర్థికంగా ఉన్న వారి పరిస్థితి బాగున్నా పేద వితంతువుల పరిస్థితి దారుణంగా మారింది.

పింఛన్ అందించాలి : పోషక్క వితంతువురాలు

నా భర్త అనారోగ్యం బారిన పడి రెండేళ్ల క్రితం మతిచెందాడు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో ముగ్గురు పిల్లల కుటుంబ పోషణ భారంగా మారింది. పింఛన్ వస్తే కొంత ఆసరాగా ఉంటుందని భావిస్తే రెండేళ్ల నుంచి రావడం లేదు.

దరఖాస్తులు తీసుకుంటున్నాం : శ్యాంసుంధర్, ఎంపీడీఓ

కొత్త పింఛన్ల కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. మండలం లోని వివిధ గ్రామాల వారు దరఖాస్తులు ఇస్తే తీసుకుంటున్నాం. ప్రభుత్వం పింఛన్ లాగిన్‌ను ఓపెన్ చేస్తే నమోదు చేస్తాం. ఇదే విష యాన్ని ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

పెండింగ్ దరఖాస్తులు ..

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వితంతువులు,దివ్యాంగులు,వివిధ రకాల అర్హులైన పింఛన్ దారులు ఇప్పటివరకు మండల కార్యాలయం లో 800 మంది దరఖాస్తులు చేసుకున్నారు. నేటికి ఏ ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు కాలేదు. ప్రతి నెలా దివ్యాంగులు సదరం క్యాంపులకు వెళ్లి అర్హత సర్టిఫికెట్ తెచ్చు కున్నా సంబంధిత పింఛన్ సైట్ ఓపెన్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి చనిపోతే ఆ వ్యక్తి స్థానంలో కుటుంబ సభ్యుల్లో అర్హులైన ఒక్కరికి అందిస్తున్నారు.కొత్త పింఛన్ మాత్రం అందడం లేదు.

శిథిలావస్తలో చిట్యాల గ్రామపంచాయతీ భవనం

- భయంతో పనులు నిర్వహిస్తున్న సిబ్బంది
- పట్టించుకోని పాలకులు
- నూతన భవనాన్ని నిర్మించాలి
- గ్రామ ప్రజల వేడుకోలు

నవతెలంగాణ-చిట్యాల





మండల కేంద్రంలోని చిట్యాల గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా స్లాబ్ పై బిచ్చలు ఊడిపోతున్నాయి. సిబ్బంది అందులో వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. రూముల్లో వర్షపు నీటికి గోడలు పదును కావడంతో రూముల్లోకి నీరు వచ్చి ఆఫీస్ ఫైల్, బీరువాలు, కంప్యూటర్, గ్రామపంచాయతీ సామాగ్రి ఇతర వస్తువులు పూర్తిగా తడిచిపోతున్నాయని సిబ్బంది ఆరోపిస్తున్నారు. గత 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో గతంలో కురిసిన వర్షాలకు స్వల్పంగా దెబ్బతిందని అధికారులు తెలిపారు గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపు నీరు రూముల్లోకి వచ్చి పూర్తిగా గోడలు నాని శిథిలావస్థకు చేరిందని పేర్కొన్నారు. సిబ్బంది అందులోకి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నూతన భవనాన్ని మంజూరు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు వేడుకుంటున్నారు.

అలసత్వానికి అవకాశం ఇవ్వొద్దు : జిల్లా ఎస్పీ



నవతెలంగాణ-భూపాలపల్లి

శాంతి భద్రతల పరిక్షణలో అలసత్వానికి అవకాశం ఇవ్వకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సై లతో నేర సమీక్షా సమావేశం నిర్వహించి, వివిధ పోలిసు స్టేషన్ లో ఉన్న పెండింగ్ కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ... అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. కేసును పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల విక్రయాలతో పాటు రవాణా, అమ్మకాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి, నారాయణ నాయక్, సుభాష్ బాబు, జిల్లా పరిధిలోని సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ 85 గేట్లు ఎత్తివేత

ఇన్‌ఫ్లో 7లక్షల71వేల580 క్యూసెక్కులు

నవతెలంగాణ-మహదేవపూర్

తెలంగాణ మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో గోదావరి ప్రాణహిత నదులకు వరద ప్రవాహం నిలకడగా మేడిగడ్డ బ్యారేజ్‌కి 7లక్షల71వేల580 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దీంతో అధికారులు 85 గేట్లు ఎత్తి అదే స్థాయిలో నీటిని దిగువదులుతున్నారు. అన్నారం బ్యారేజ్‌కి 19600 నీటి ప్రవాహం రావడంతో 66 గేట్లు ఎత్తి అదే స్థాయిలో పదులుతున్నారు. భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉండడంతో పరిసరప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 11 అడుగులకు నీరు చేరుకుంది.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

నవతెలంగాణ-భూపాలపల్లి



పలిమెల మండల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం ఐ.డి.ఓ.సి కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అధికారులతో పలిమెల మండల ప్రజలకు సౌకర్యాలు కల్పనపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ఉన్న పలిమెల మండలాన్ని అభివద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. శాఖల వారిగా కార్యచరణ ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ఇటీవల పలిమల మండలంలో పర్యటించినప్పుడు ప్రజలు సమస్యలను తన దష్టికి తీసుకురావడం జరిగిందని అన్నారు. మండలం లోని దమ్మూరులో వ్యవసాయానికి త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు. మోదేడు, కమాన్ పల్లి, బోడాయిగూడెం గ్రామాలల్లో గిరి వికాసం పథకం కింద బోరు బావులు వేయించి గోదావరి నుండి వ్యవసాయ క్షేత్రాలకు పైప్‌లైన్ ద్వారా నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. మారుమూల గ్రామాలలో వైద్య సేవలు మెరుగుపరచేందుకు పలిమెల మండల కేంద్రంలో 108 అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తేవాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. దమ్మూరు గ్రామం నుండి ఆర్టీసీ బస్సు సేవలు కొనసాగుతున్నాయని అన్నారు. మండలంలోని గ్రామాలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం అందించాలని అవసరం అయితే సౌర విద్యుత్ సేవలు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలుషిత నీరు త్రాగి రోగాల బారిన పడకుండా ఆర్ ఓ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి శుద్ధమైన త్రాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ మధుసూదన్, డిఆర్డీఓ నరేష్, ఆర్ డబ్ల్యూఎస్ ఈ ఈ నిర్మల, ఆర్డిఓ మంగీలాల్ ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్కౌంటర్‌లో గణపురం మండల వావో మృతి

నవతెలంగాణ-గణపురం



గణపురం మండలం బుద్ధారం గ్రామానికి చెందిన నల్లమారి అశోక్ అలియాస్ విజేందర్ (40) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దామరతోగు అడవుల్లో జరిగిన ఎన్కౌంటర్‌లో గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బుద్ధారం బీసీ కాలనీవాసుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. బుద్ధారం గ్రామానికి చెందిన నల్లమారి వీరస్వామి రాజమ్మలకు ముగ్గురు సంతానం చిన్నవాడు అశోక్. తల్లి రాజమ్మ చిన్నతనంలోనే చనిపోయింది. కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో అశోక్ ఇదే గ్రామంలో గుమాస్తాగా, వ్యాన్ డ్రైవర్ గా పని చేశాడు ఈ క్రమంలో ఇద్దరిని పెండ్లి చేసుకోగా విడాకులయ్యాయి. ఈక్రమంలో కొత్తగూడలోని న్యూ డెమోక్రసీ పార్టీతో సంబంధాలు పెట్టుకున్నాడు 2017లో అరెస్టు అయ్యాడు. 2019లో మావోయిస్టు పార్టీలోకి వెళ్ళాడు. అప్పటినుండి ఇప్పటి వరకు ఆయనను ఎవరు చూడలేదని గ్రామస్తులు తెలిపారు. కాగా మావోయిస్టు పార్టీలో చేరి దళసభ్యునిగా పనిచేస్తున్న అశోక్ పై ప్రభుత్వం లక్ష రూపాయల రివార్డు కూడా ప్రకటించింది. కాగా అశోక్ తండ్రి వీరస్వామి అనారోగ్యంతో చనిపోగా ఆయన సంవత్సరికం రోజే కొడుకు అశోక్ ఎన్కౌంటర్లో మృతి చెందడం తో గ్రామ స్తులు కన్నీటిపర్యంతమయ్యారు.

14 ఏండ్ల కిందట

14 ఏండ్ల కిందట మండలం ధర్మరావు పేట గ్రామ శివారులో డిసిఎం డ్రైవర్ గా పనిచేస్తున్న సమయంలో డీసీఎం బోల్తా పడిన ఘటనలో అశోక్ పై కేసు నమోదు అయింది. ఈ క్రమంలో అశోక్ కేసులకు భయపడి బుద్ధారం గ్రామానికి రాకుండా తలదాచుకుంటూ న్యూ డెమోక్రసీ గ్రూపులలో చేరి పోయినట్లు సమాచారం. అనంతరం జరిగిన పరిణామాల తర్వాత రెండు పర్యాయాలు నర్సంపేట సమీపంలో పోలీసులకు అరెస్ట్ అయి, జైలు జీవితం గడిపిన అనంతరం తిరిగి ఉద్యమ బాట పట్టిన పట్టాడు. ఎన్కౌంటర్ మతుడు అశోక్ అలియాస్ విజేందర్ జాలి జీవితం అనంతరం మావోయిస్టుల తో సంబంధాల ఏర్పాటు చేసుకొని దళంలో చేరి పని చేస్తూ వెళ్లినట్లు బంధువులు తెలిపారు.

సంక్షేమ రంగాల ప్రాధాన్యతను గుర్తించి ఖర్చు చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు

నవతెలంగాణ-భూపాలపల్లి



2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం, దళిత, గిరిజన, విద్యా వైద్య రంగాలకు కేటాయింపులను స్వాగతిస్తున్నామని సీపీఐ(ఎం) జిల్లా కార్య దర్శి బందు సాయిలు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత 10 సంవత్సరా లలో కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిగా ఖర్చు చేయలేదన్నారు. దళిత, గిరిజన ఉప ప్రణాళికలో ఏనాడూ 60 శాతానికి మించి వ్యయం చేయకపోవడం వల్ల ఆ వర్గాలు దారిద్ర్యం నుంచి బయటలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయాలని కోరారు. వ్యవసాయ రంగంలో రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతుబీమాతో పాటు, వ్యవసాయ పరిశోధనలకు రూ.72659 కోట్లు కేటాయింపులు చేశారని తెలిపారు. విద్యా, వైద్యానికి చేసిన కేటాయిం పులు గతంలాగే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అక్షరా స్యత 66శాతం దాటడంలేదు. సాక్షరత మిషన్ లాంటి పథకాలను తొలగించడం, ప్రభుత్వ పాఠశాలలకు భవనాలు, ఇతర సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రయివేటు విద్యాలయాలకు వెళున్నారని అన్నారు. వైద్యరంగానికి కేటాయించిన నిధులు కూడా బస్తీ దవాఖానాలకు, గ్రామ దవాఖానాలకు, ప్రభుత్వ ఆసు పత్రులకు సరిపోవని తెలిపారు. ఈ రెండు రంగా లకు కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉంద న్నారు. రాష్ట్రంలో ఇండ్లు, ఇండ్ల స్థలాల కొరకు పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు వేసుకున్నవారిని తొలగిస్తున్నారని, ప్రస్తుత బడ్జెట్‌లో ఇండ్ల నిర్మాణానికి బీసీలకు రు. 5లక్షలు, దళితులకు రు.6లక్షలు ఇస్తామని, నియోజ కవర్గానికి 3500 ఇండ్లు కేటాయిస్తామని ప్రకటిం చారని, దీనికి రు.8424 కోట్లు మాత్రమే కేటాయిం చారని తెలిపారు. రాష్ట్రంలో లక్షల మంది ఇండ్లు లేనివారు దశబ్దాల తరబడి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అర్హతగల ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేసి ఇండ్ల నిర్మాణానికి కనీసం రూ.10లక్షల చొప్పున ఇవ్వాలని అన్నారు. అందుకనుగుణంగా బడ్జెట్‌ను పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని, మహిళలకు రూ.1లక్ష ఆర్థిక సహాయాన్ని వడ్డీలేకుండా రు.2లక్షలకు పెంచాలని కోరారు.

రుణమాఫీ పట్ల రైతుల సంతోషం

వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్

నవతెలంగాణ-గణపురం



ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో రైతులు ఎంతో సంతో షంగా ఉన్నారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్ జిల్లా ఉద్యానవన అధికారి సంజీవరావు అన్నారు. గురువారం మండలం లోని మైలారం గ్రామంలో రుణమాఫీ పొందిన రైతులతో ముఖాముఖి నిర్వ హించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు మాట్లాడుతూ పంట పెట్టుబడులకు తిరిగి బ్యాంకుల నుండి రుణం తీసుకోవడం జరుగు తుందని అన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ ఈ గ్రామంలో లక్ష లోపు రుణం పొందిన 62 మందికి రుణమాఫీ వర్తించిందని అన్నారు. ఘనపురం మండలంలో 1974 మంది రైతులకు లక్షలోపు రుణం మాఫీ అయ్యిందని తెలిపారు. రైతులకు ప్రభు త్వ అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు మాట్లాడుతూ మిరప పంటలో సమగ్ర యాజమాన్య సంరక్షణ చర్యలు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజయ్య , వెంకటేశ్వర స్వామి తదితర రైతులు పాల్గొన్నారు.

యాదవ సంఘం నూతన కమిటీలు ఎన్నిక

నవతెలంగాణ-మల్హర్‌రావు



మండలంలోని పెద్దతూండ్ల గ్రామ అఖిల భారత యాదవ మహాసభ నూతన కమిటీలను శుక్రవారం నియామకం చేసినట్లుగా కాటారం డివిజన్ కార్యదర్శి బోయిని రాజయ్య యాదవ్ తెలిపారు. గ్రామ అధ్యక్షుడుగా బియ్యని రాజమొగిలి యాదవ్, గౌరవ అధ్యక్షుడు బియ్యని ఉషన్న యాదవ్, ఉపాధ్యక్షుడుగా జక్కుల లక్ష్మన్ యాదవ్,ప్రధాన కార్యదర్శిగా బొంతల హరీష్ యాదవ్, కార్యదర్శిగా బియ్యని కుమార్ యాదవ్, కోశాధికారిగా పర్సవెన రమేష్ యాదవ్ ఎన్నికయ్యారు. రానున్న సర్వత్రా ఎన్నికల్లో యాదవులు ఐక్యాత చాటి, యాదవుల నుంచి ప్రజాప్రతినిధులుగా గెలుపొందాలని సూ చించారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడుగా యాధండ్ల రామన్న యాదవ్, డివిజన్ సహాయ కార్యదర్శి కోడారి చిన మల్లయ్య యాదవ్, అప్పుల భూమేస్ యాదవ్,మొగిలి రాజ్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వ బడ్జెట్

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య

నవతెలంగాణ-జఫర్ గడ్



2024-25 సంవత్సరానికి పార్లమెంటులో ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్ రైతులను, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా మోసం చేసే విధంగా ఉందని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబట్టేందుకు పూనుకుందని రైతు వ్యతిరేకంగా ఉన్న బడ్జెట్‌ను సవరించాలని, వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. మండలంలోని సాగరం గ్రామంలో గురువారం తెలంగాణ రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు పిన్నింటి సాంబయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా సోమయ్య హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ బడ్జెట్‌లో వ్యవసాయ రంగం, ఎరువులు సబ్సిడీ, ఫసల్ బీమా, ఉపాధి హామీ పథకం నిధులు తగ్గించడం దారుణమన్నారు. రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చనందుకు ఈ బడ్జెట్ పూనుకోలేదన్నారు. పైగా ఎరువులకు ఇస్తున్న సబ్సిడీలో కోత పెట్టేందుకు పూనుకుందని, 14 వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరలను పెంచామని ఆర్థిక మంత్రి ప్రకటించారని కాని, స్వామినాథ్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని, కొనుగోలుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని కూడా కంపెనీల కాకుండా రైతాంగానికి ఉపయోగపడే విధంగా మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి విభజన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు తెలంగాణ నుంచి ఎన్నికైన ఎనిమిది మంది బిజెపి పార్లమెంట్ సభ్యులు కేంద్రంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పిన్నింటి సమ్మయ్య , నల్లబెట్ల కుమార్, పార్టీ మండల కమిటీ సభ్యులుపెరబోయిన నాగరాజు, కత్తుల ఐలయ్య, కాడబోయిన రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 28 లోపు రుణాలు రెన్యూవల్ చేయాలి

నవతెలంగాణ-లింగాలఘనపురం

ఈనెల28 తేదీ లోపు రుణాలు రెన్యువల్ ప్రాసెస్ ప్రక్రియ ను పూర్తి చేయాలని జనగామ ఆర్డీవో కొమురయ్య బ్యాంకు లకు ఆదేశించారు. గురువారం మండలం లోని నెల్లుట్ల గ్రామంలో కెనరా బ్యాంకు రుణ మాఫీ కి సంబంధించి కెనరా బ్యాంక్ , నవాబుపేట (జనగాం), డీసీసీబీ జనగామ, కెనరా బ్యాంక్ , నెల్లుట్ల లను సందర్శించి రుణమాఫీ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం మొత్తానికి లక్ష రూపాయల లోపు రుణమాఫీ 1829 మంది రైతులకు, రూ 9.38 కోట్ల రూపాయల జమ చేయడం జరిగిందన్నారు. బ్యాంక్ లు అన్ని కూడా రైతు లకు ఈ నెల 28 వ తేదీ లోపు రెన్యూవల్ ప్రాసెస్ పూర్తి చేసి రైతులకు మరల రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. వీరి వెంట తహసీల్దార్ వినయలత , మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు ,ఎఈఓ శ్రీనివాస్, ఆర్ఐ కిశోర్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి: ఎంపీడీవో

నవతెలంగాణ-పాలకుర్తి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలను పాటించి, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో ఎ.రాములు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో గల ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా, ఎంపీడీవో రాములు మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఆదేశించారు. విద్యార్థినీ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలలోని ఉపాధ్యాయులు అందుబాటులో ఉండి విద్యార్థిని, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తీసుకోవాలని సూచించారు. ఎలాంటి నాణ్యత ప్రమాణాలను ఉల్లంఘించినా ఉపాధ్యాయులతో పాటు మధ్యాహ్న భోజన నిర్వాహకులపై చరలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేషన్ ఘనపూర్ ఎంపీడీఓ గా మధు సూధన్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ- స్టేషన్ ఘనపూర్

నూతన ఎంపీడీఓగా మధు సూధన్ గురువారం బాధ్యత స్వీకరించారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధి అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమేష్, పంచాయితీ కార్యదర్శిలు సత్యనారాయణ, శ్రీకాంత్, ఈసీ కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాంసం వ్యాపారులపై ఆగ్రహం

వ్యర్థాలను విడిస్తే చర్యలు: ఆర్డీఓ వెంకన్న

నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్

మాంసం వ్యాపారులు వ్యర్థాలను రోడ్లపై విడిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ, స్టేషన్ ఘనపూర్ ప్రత్యేకాధికారి డీఎస్ వెంకన్న లు హెచ్చరించారు. గురువారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కేంద్రంలో చికెన్, మటన్ మాంసం అమ్మకపు వ్యాపారులను పిలిచి సూచనలు ఇచ్చారు. మాంసం వ్యర్థాలను రోడ్లపై వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వానాకాలం సీజన్ కాబట్టి ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సత్యం, వీఓఏ లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ చంద్రమోహన్‌కు సన్మానం..

నవతెలంగాణ-కొడకండ్ల

కొడకండ్ల నూతన తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించిన కోల చంద్రమోహన్ ను గురువారం ఏడు నూతల గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ మండల ప్రజలందరూ భూ విధాల విషయంలోనైనా అభివృద్ధి విషయంలోనైనా అధికారులు ప్రజలు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

నూతన తహసీల్దార్‌గా నాగేశ్వరచారి

నవతెలంగాణ-తరిగొప్పుల

మండల నూతన తహసీల్దార్‌గా భువనగిరి కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఎం.నాగేశ్వరచారి బదిలీపై మండల తహసీల్దార్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చెరువులు కుంటలు నింపాలి

నవతెలంగాణ-బచ్చన్నపేట

రిజర్వాయర్ ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాల చెరువులు, కుంటలను నింపాలని బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో సరైన వర్షాలు లేక భూగర్భ జలాలు తగ్గడం ద్వారా పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని, రైతాంగం పెట్టుబడులు పెట్టి దిక్కు తోచని స్థితిలో ఉన్నారని, పంటలకు చీడపీడలు తగిలి, అనేక రూపాల్లో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నటువంటి తరుణంలో నీరు కూడా అందించకపోవడం వల్ల దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు.వేలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన ప్రాజెక్టుల నుండి నీరు అందించకపోతే ఆ ప్రాజెక్టుల వల్ల ఏమి లాభమని ప్రశ్నించారు. అనేక సమస్యలతో సతమతమవుతున్న రైతాంగం తీవ్రమైన ఆవేదనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని చెరువులను కుంటలను వెంటనే నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని.. లేని పక్షంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులను సమీకరించి ఉద్యమిస్తామని తెలిపారు.

సీఎంఆర్ బియ్యం తరలింపు ప్రక్రియను ఆగస్టు 31లోగా పూర్తిచేయాలి: అదనపు కలెక్టర్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

2023-24 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సీఎంఆర్ బియ్యాన్ని తరలించే ప్రక్రియను ఆగస్టు 31 లోపు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ సంబంధిత అధికారులను మిల్లర్లను ఆదేశించారు. తన కార్యాలయంలో గురువారం రోహిత్ సింగ్ సంబంధిత రైస్ మిలర్ల అధ్యక్ష, కార్యదర్శులతో సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి తరలించే ప్రక్రియపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఖరీఫ్/రబీ 2023-24 సీజన్ కు సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని సకాలంలో రోజూ వారి లక్ష్యాల వారీగా ఎఫ్.సి.ఐ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి తరలించాలని సూచించారు. అలాగే బియ్యం అప్పగించే ప్రక్రియను వేగవంతం చేసి, ఆగస్టు 31లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డీసీఎస్ఓ రోజా రాణి, డియం ప్రసాద్, డిటి పౌరసరఫరాల శాఖ ఇ. శ్రీనివాసు, జి. దేవా, మిల్లర్ల అధ్యక్షులు పజ్జూరి జయహరి, బెల్దీ వెంకన్న చల్లా శ్రీనివాస్ రెడ్డి, ముత్తయ్య, దిలీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి



దేవాదుల ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

నవతెలంగాణ - జనగామ కలెక్టరేట్

దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి కలెక్టర్ గురువారం దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు, చెక్ డ్యామ్ లు, జాతీయ రహదారుల నిర్మాణాల కొరకు సేకరిస్తున్న భూ సేకరణ ప్రక్రియపై సంబంధిత రెవెన్యూ, నీటిపారుదల, సర్వే, రహదారుల శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తొలుత దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు పనులపై కలెక్టర్ సమీక్షిస్తూ ప్రస్తుత పనులు ఏ స్థాయిలో ఉన్నాయో పూర్తి వివరాలు అందించాలని, ఇంకనూ కావాల్సిన నిధులపై ప్రతిపాదనలు అందించాలన్నారు. ఇప్పటివరకు చేపట్టిన పనులపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. గౌరవెల్లి కెనాల్ కింద 322 ఎకరాల భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. అలాగే పెండింగ్ లో ఉన్న మిగిలిన రహదారుల నిర్మాణ పనులు, ఇరిగేషన్ ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ, పేమెంట్ లను ఆగస్టు 8 లోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా మినీ టెక్టైల్ పార్క్, టీఎస్ఐసీ కి సంబంధించిన భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న ఫైల్ లను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ జనగామ కొమురయ్య, సర్వే ఏడీ కొండల్ రెడ్డి, రెవెన్యూ, నీటిపారుదల, సర్వే శాఖల ఈఈలు, ఎస్ఈలు, డీఈలు, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన ఆయిల్ పామ్ పంట సాగు లక్ష్యాలను చేరుకోవాలి

జిల్లాలో ఆయిల్ పామ్ పంటలను ప్రోత్సహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆయిల్ పామ్ పంట సాగుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆయిల్ పామ్ పంట సాగు లక్ష్యం 3000 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 726 ఎకరాల్లో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ పూర్తిచేయడం జరిగిందని, మిగిలిన లక్ష్యాలను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు సమన్వయంతో లాభాలు వచ్చే పంటల వైపు రైతులు మొగ్గుచూపే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రైతు వేదికల్లో సమావేశాలను ఏర్పాటు చేసి, ఆయిల్ పామ్ పంట సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి బుధవారం ఏఈఓలు ఎరువులు, విత్తనాల దుకాణాలను సందర్శించి, స్టాక్ రిజిస్టర్ వివరాలను, విత్తనాలు, ఎరువుల నిల్వలను పర్యవేక్షించాలని సూచించారు. అలాగే ప్రతి శుక్రవారం గ్రామ పంచాయతీలను, అంగన్వాడీలను, పాఠశాలలను, న్యూట్రీ గార్డెన్ లను సందర్శించి, పరిశీలించాలని, న్యూట్రి గార్డెన్ లలో వివిధ ఆకుకూరలు, కూరగాయలను పెంచాలని, అదే విధంగా రైతు వేదికల ప్రాంగణాల్లో ఈ గార్డెన్ల ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టాలని, అందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను రూపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా చేపట్టిన రైతు రుణ మాఫీ ఫ్లాగ్ షిప్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అర్హులైన రైతులను రైతు బీమాలో నమోదు చేయాలని, పంట నమోదు వివరాలను యాప్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఉద్యాన వన శాఖ అధికారిణి కెఆర్. లత, డీఏఓ వినోద్ కుమార్, అన్ని మండలాల ఏవోలు, ఏఈఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మైక్రో ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యానిలయాలుగా అంగన్‌వాడీలు

అంగన్వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యానిలయాలుగా ఆధునికరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి కలెక్టర్ అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు గాను కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం (695) అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇందులో భాగంగా అన్ని మౌలిక సదుపాయాలు వీటిలో కల్పించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో వేసే పెయింటింగ్ చిన్నారులకు విద్యా బోధన సులభంగా అర్థం అయ్యే విధంగా ఉండాలన్నారు. కేంద్రాల గోడలపై పెయింటింగ్ రూపకల్పన వినూత్నంగా ఉండాలని, అందుకు సంబంధించిన రూపకల్పన వివరాల నివేదికను సమర్పించాలన్నారు. అలాగే జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, లైట్ లు, ఫ్యాన్లు, ప్రహరీ గోడ, తాగునీరు, సంపులు, ట్యాంకులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తదితర సౌకర్యాల పనులన్నీ నాణ్యతతో చేపట్టాలని పంచాయతీరాజ్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, తరగతి గదులను వినూత్న పద్ధతిలో తీర్చిదిద్దాలన్నారు. వీటిలో ఈ మౌలిక వసతుల కల్పనకు పూర్తి బడ్జెట్ ప్లాన్ నివేదికను సమర్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తూ పిల్లలకు నాణ్యమైన ప్రీ ప్రైమరీ విద్యను అందించే విధంగా వాటిని బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జెడ్పీ సీఈవో అనిల్ కుమార్, డీడబ్ల్యూఓ జయంతి, డీఈఓ రాము, పీఆర్ ఈఈ శ్రీనివాస రావు, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ శ్రీకాంత్, సీడీపీఓలు ఫ్లోరెన్స్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఏసీ రెడ్డి నరసింహారెడ్డిని ఆదర్శంగా తీసుకుని ఉద్యమాలు నిర్మించాలి

ఈనెల 28న ఏసి రెడ్డి నరసింహారెడ్డి 33వ వర్ధంతి సభను జయప్రదం చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి

నవతెలంగాణ-జనగామ



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జనగామ ప్రాంత ఉద్యమ నిర్మాత ఏసి రెడ్డి నరసింహారెడ్డిని ఆదర్శంగా తీసుకుని ఉద్యమాలు నిర్మించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి అన్నారు. ఈనెల 28 తేదీన జిల్లా కేంద్రంలో జనగామ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం)జనగామ ప్రాంత ఉద్యమ నిర్మాత అమరజీవి కామ్రేడ్ ఏసీ రెడ్డి నరసింహారెడ్డి 28వ వర్ధంతి సభ కరపత్రాన్ని గురువారం స్థానిక సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మోకు కనకా రెడ్డి మాట్లాడుతూ ఈనెల 28న ఆదివారం నెహ్రూ పార్క్ సమీపంలోని కామాక్షి ఫంక్షన్ హాల్ లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈవర్ధంతి సభకు సందర్భంగా స్థానిక క్రిస్టియన్ గ్రౌండ్ ఆర్టిసి చౌరస్తా మీదిగా నెహ్రూ పార్క్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ ఉంటుందన్నారు. ఈ ర్యాలీలో సీపీఐ(ఎం) పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.అహల్య, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, సీనియర్ నాయకులు బొట్ల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, పట్టణ కమిటీ సభ్యులు పందిళ్ళ కళ్యాణి, పల్లెల లలిత, బాల్నే వెంకట మల్లయ్య, కళ్యాణం లింగం తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను సేవించి యువత భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దు



పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

నవతెలంగాణ-జనగామ

గంజాయి లాంటి మత్తు పదార్థా లను సేవించి యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ విద్యార్థులకు సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం పట్ల కలిగే నష్టాలపై జనగామ డివిజన్ పోలీసుల అధ్వర్యంలో జనగామ లోని క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థు లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా హజరయి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ విద్యార్థులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం ద్వారా నేడు యువత భవిష్యత్తు ప్రమాదంలో వుందని తెలిపారు. ఈ ప్రమాదం భారీన పడకుండా యువత అప్రమత్తంగా వుండాలని సూచించారు. కేవలం క్షణికానందం కోసం మత్తు పదార్థాల సేవించడం ద్వారా విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించడం ఓ కలగానే మిగిలి పోతుందని అన్నారు. కొంత మంది డబ్బు సంపాదన కోసం గంజాయి లాంటి మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడి యువతకు అందించడం జరుగుతోందని ఉన్నారు. ఇలాంటి స్వార్థపరుల చేతుల్లో యువత బలికావద్దని హెచ్చరించారు. ఎన్నో ఆశలతో మిమ్మల్ని ఉన్నత చదువులు చదివించి మీ బంగారు భవిష్యత్తు కై ఎదురుచూసే తల్లిదండ్రులకు తమ పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలుగా మారడంతో తల్లిదండ్రులు వేదనకు గురౌవుతున్నారు అని తెలిపారు. ప్రతి ఒక్కరు మీ తల్లిదండ్రుల గురించి ఒక్కసారి ఆలోచించండి అన్నారు. మత్తు పదార్థాల వినియోగం ద్వారా ఆర్థికంగా నష్టపోవడంతో పాటు, ఎన్నో ఆరోగ్య సమస్యలు చుట్టుముడు తాయని యువత గ్రహించాలని అన్నారు. అలాగే మీ తోటి మిత్రులు గంజాయిని సేవిస్తున్నట్లయితే మత్తు పదార్థాల వినియోగం ద్వారా నష్టాలపై వారికి అవగాహన కల్పించాలని అని సూచించారు. ప్రధానంగా గంజాయి లాంటి మత్తు పదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చోరవ చూపిస్తోందని అని తెలిపారు. ఇందులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి నియంత్రణకై డ్రగ్స్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు.ఎక్కడ్కెనా మత్తు పదార్థాలు సేవిస్తున్న, రవాణా, విక్రయాలు పాల్పడుతున్న వారిపై పట్టుకోవడే ఈ విభాగం ప్రత్యేకతని తెలిపారు. ఎవరైన మత్తు పదార్థాలు అమ్మిన, సేవించిన 87125 84473కు సమాచారం అందించడం ద్వారా వారిపై తగు చర్యలు చేపడతామన్నారు.గంజాయి సమచారం అందించిన వారికి నగదు పురస్కారం కూడా అందజేయ బడుతుందని అన్నారు. సమాచారం తెలిపినవారి వివరాలు గోప్యంగా వుంచబడు తాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతరం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రమాణం చేయించ డంతో పాటు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వాల్ పోస్టర్లను పోలీస్ కమిషనర్ ఆవిష్కరించారు.. ఈ సమావేసంలో వెస్ట్ జోన్ డిసిపి రాజ మహేంద్ర నాయక్, జనగామ ఎసిపి పార్థసారథి, ఘన్ పూర్ ఏసీపీ భీమ్ శర్మ, నార్కోటిక్ విభాగం ఏసీపీ సైదులు, క్రీస్తుజ్యోతి ఇంజరింగ్ కళాశాల డైరెక్టర్ రెవరెండ్ విజయ పాల్ రెడ్డి, డా. సిద్దారెడ్డి, ఇన్స్ స్పెక్టర్లు రఘుపతి రెడ్డి, మహేందర్ రెడ్డి, సాయిరమణతో పాటు జనగామ డివిజన్ ఎస్ఐ లు కళాశాల అధ్యాపకులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల పట్టివేత


నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్/జనగామ



పట్టణంలో వివిధ హోటళ్లలో ఉపయోగిస్తున్న గృహ అవసర గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రోజా రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌరసరఫరాల శాఖ డీటీలు శ్రీనివాస్, దేవలు వివిధ హోటళ్లలో తనిఖీలు చేసి పట్టుకున్న 26 సిలిండర్ లను వీరభద్ర గ్యాస్ ఏజెన్సీకి భద్రత నిమిత్తము అప్పగించినట్లు పేర్కొన్నారు. గృహ అవసర గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

విద్యకు ప్రాధాన్యత లేని రాష్ట్ర బడ్జెట్ : టీపీటీఎఫ్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి కేటాయింపులు చూస్తే విద్యాభివృద్ధిపై ప్రభుత్వం మాటలే తప్ప చేతలు లేవన్నట్టుగా స్పష్టం అవుతుందని, 2,91,159 కోట్ల రాష్ట్ర బడ్జెట్ లో 21,292 కోట్లు మాత్రమే విద్యకు కేటాయింపులు చేశారని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. గత సంవత్సరం 6.56 శాతం కేటాయించగా ఇప్పుడు 7.31 శాతం కేటాయించారని, విశ్వవిద్యాలయాలకు గత ప్రభుత్వం ఇచ్చిన విధంగానే 500 కోట్లు మాత్రమే కేటాయించడం చూస్తే విద్య పట్ల ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగించనున్నదని తేటతెల్లమైందన్నారు. విద్యారంగంలో వినూత్న మార్పులు చేస్తామని, ఇంటర్నేషనల్ స్కూల్స్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నెలకొల్పుతామని చెప్పుకున్న పాలకులు అందుకు తగ్గట్లుగా బడ్జెట్ కేటాయింపులు లేవని ఆరోపించారు. నిధుల కేటాయింపు పెంచకపోవడంతో విద్యను ప్రైవేటురంగానికి వదిలివేసే కుట్రగా భావించాల్సివస్తోందిని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన విధంగా బడ్జెట్లో 15 శాతం నిధులు కేటాయించినా కనీసం 44.6 వేల కోట్ల నిధులు వచ్చేవని, అందులో సగం కూడా కాకుండా 21.3 వేల కోట్లకే పరిమితమైందన్నారు. అరకొర నిధులతో అందరికీ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య అందని ద్రాక్ష కానున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను నిరసిస్తూ ప్రధానమంత్రి మోడీ దిష్టిబొమ్మను గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దగ్ధం చేశాయి. ఈ సందర్భంగా పార్టీ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అనే పదాన్ని పలకడానికి కూడా ఇష్టపడలేదని, పునర్విభజన చట్టం ప్రస్తావిస్తూ ఆంధ్రాకి నిధులు కేటాయించిందని ఆరోపించారు. తెలంగాణ విషయంలో ఎందుకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు. కేంద్రం మనసులో తెలంగాణ పట్ల ఇంత కక్ష ఉందా అన్నాడు. తెలంగాణపై మోడీ కక్షపూరిత వైఖరిని తీవ్రంగా ఖండిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎస్యుఐ రాష్ట్ర నాయకులు జక్కుల వేణుమాధవ్, అధికార ప్రతినిధి వేముల మల్లేశం, మోర్తాల ప్రభాకర్, పిఎసిఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, మున్సిపల్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గదెపాక రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్..

నవతెలంగాణ-దేవరుప్పుల

మండలంలోని చిన్నమాడూరు గ్రామ శివారులో గురువారం ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా ఎస్సై సృజన్ కుమార్ తన సిబ్బందితో వెళ్లి రూ.5.750వేలు, రెండు సెల్ ఫోన్ లు వారి వద్ద పట్టుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండల పరిధిలో ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయబడుతాయని, పాన్ షాపులలో, కిరాణా షాపులలో డ్రగ్స్, గంజాయి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్ర బడ్జెట్‌ను నిరసిస్తూ దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ-జనగామ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ని నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో గురువారం జనగామ ఆర్టీసి చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. దిష్టిబొమ్మను దగ్ధం చేస్తుండగా అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి మాట్లాడుతూ ప్రగతి తెచ్చే బడ్జెట్ తెస్తా అని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంగడికి పొయి గొంగడి కొనుకొచ్చినట్లు ఉంది అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రమేష్, హరిచంద్ర గుప్తా, చౌడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఝాన్సీ రెడ్డి

నవతెలంగాణ-కొడకండ్ల



త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సర్వం కావాలని పాలకుర్తి నియో తజకవర్గ ఇన్‌ఛార్జ్ హనుమాన్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సాయంకాలం ఏర్పాటుచేసిన వివిధ గ్రామాల ముఖ్య నాయకులు కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఆదుకున్న కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు ప్రాముఖ్యత ఉంటుందని, కార్యకర్తలు ఎవరు అధైర్య పడాల్సిన పనిలేదని సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులకు వివరిస్తూ తన దృష్టికి తీసుకువస్తే ప్రజల సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ మండల పార్టీ అధ్యక్షుడు సురేష్ నాయక్ తో పాటు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన గ్రామ పార్టీ అధ్యక్షులు, యూత్ నాయకులు ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందాం

నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

నవతెలంగాణ-దేవరుప్పుల



ప్రజా ప్రభుత్వంలో పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా దేవరుప్పుల మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయాడమే తమ లక్ష్యమని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామా గ్రామాన ఇండ్లు లేని నిరుపేదలకు, మౌలిక సదుపాయాలు ఏర్పాట్లపై సమీక్ష చేయాలని, అందుకు తగిన నిధులు కేటాయింపు, నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు, అర్హులైన వారికి పింఛన్లు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూములు లాక్కోవడం మానుకోవాలి
జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌నాయక్



నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అధికారులు దౌర్జన్యంగా రైతుల సాగు భూములు అక్రమంగా లాగేసుకోవడం మానుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లో మహబూబాబాద్‌కు చెందిన గిరిజన రైతులు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడారు. గత ప్రభుత్వం తప్పుడు విధానాల వల్ల ఇప్పటికే మెడికల్ కాలేజీలు, కలెక్టర్ ఆఫీసు అంటూ భూములు గుంజుకున్నదని అన్నారు. వారు చేసిన తప్పులనే ప్రస్తుత ప్రభుత్వం చేస్తుందని తీరు మార్చుకోవాలని సూచించారు. మహబూబాద్ ప్రాంతంలోని బీసీ కాలనీ సర్వేనెంబర్ 551లో రైతులకు పట్టాలు ఉన్నాయన్నారు. అయినా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రైతుల భూమిని హెూంగార్డ్స్ కు ఇండ్ల స్థలాల పేరుతో రైతుల పంటను నాశనం చేయడం సరికాదన్నారు. అందులో నిర్మించుకున్న నివాస ప్రాంతాలను దౌర్జన్యంగా ధ్వంసం చేయ డం నేరమన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బీసీ కాలనీ వద్ద పదిమంది రైతుల భూముల జోలికి వెళ్లొద్దని కోరారు. జాతీయ కమిషన్ ద్వారా తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఇబ్బందులు తలెత్తవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు అంగోత్ హనుమ, హార్జ్య, బద్య, నర్సింగ్, లక్ష్మి రాజేష్, రవి, రమేష్, అంగోత్ శ్రీను భానోత్ కృష్ణ, బానోత్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

30 శాతం నిధులు కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-మహబూబాబాద్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వినింగ్ కమిటీ సభ్యులు సూర్య ప్రకాష్, సింహాద్రి డిమాండ్ చేసారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ విద్యారంగానికి రావాల్సిన నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లోనైనా విద్యారంగానికి న్యాయం చేయాలని అన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని కోరారు.జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని అన్నారు. కురవిలో జరుగుతున్న జిల్లా శిక్షణా తరగతులకు వివిధ మండలాల ప్రతినిధులు హాజరవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు భూక్యా రాజేష్, అరుణ్, పవన్, వినయ్, అజయ్, నితిన్ పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలబడాలి
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ సోమయ్య



నవతెలంగాణ-మహబూబాబాద్

పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వారికి అండగా నిలబడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య పిలుపునిచ్చారు. గురువారం 30 వార్డులోని గుండ్లకుంట కాలనీలో పార్టీ 1,2,3, శాఖల సమావేశాలు శాఖ కార్యదర్శి మీసాల స్వరూప రాణి అధ్యక్షతన జరిగింది. పార్టీ మానుకోట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య హాజరై మాట్లాడారు. పేదల సమస్యల పరిష్కారంలో వారికి అండగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ దేశాన్ని అప్పుల ఊబిలోకి నెడుతోందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అమ్ముతూ దేశంలో నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నదని అన్నారు. దేశంలో మత ఘర్షణలు సృష్టిస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈనెల 29న బయ్యారంలో జరిగే శాఖ కార్యదర్శిల జిల్లా విస్తృతస్థాయి సమావేశంను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు చీపిరి యాకయ్య, శాఖ కార్యదర్శులు గాడిపెల్లి శ్యామ్, పూల సురేష్, ఆఫీస్ కార్యదర్శి మచ్చ వెంకన్న, ప్రజానాట్య మండలి పట్టణ కార్యదర్శి కొమ్ము శ్రీనివాసు, శాఖ కమిటీ సభ్యులు గుడ్ల బిక్షపతి, కందుకూరి జాను, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి
యూటీఎఫ్ జిల్లా కోశాధికారి నాగ మల్లయ్య



నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

సర్వీసు నిబంధనల జీవోలను సవరించి బీఈడీతో నియామకమైన ఎస్‌జిటిలకు పదోన్నతులు కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి నాగ మల్లయ్య పిలుపునిచ్చారు. మాటేడు, వెల్లికట్టే, హరిపిరాల స్కూల్లలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సహకారంతో టెట్ వివాదం పరిష్కరించుకొని పదోన్నతులు, బదిలీలకు అనుమతి సాధించుకున్నట్టు ఆయన తెలిపారు. కానీ, హడావిడిగా నిర్వహించిన పదోన్నతులు, బదిలీలలో కొన్ని పొరపాట్లు జరిగినట్టు తెలిపారు. ఉపాధ్యాయుల అప్పీల్స్ సానుకూల పరిష్కారానికి యుటిఎఫ్ కృషి చేస్తున్నదన్నారు. పండిట్, పీఈటి పోస్టుల అప్‌గ్రేడేషన్ తో దశాబ్దాలుగా నెలకొన్న వివక్ష సమసిపోయిందన్నారు. సర్వీస్ నిబంధనల జీవోలు 11,12 సవరించి డిగ్రీ, బీఈడీతో నియామకమైన ఎస్జీటీలకు పిఎస్ హెచ్ఎంలుగా పదోన్నతులు కల్పించాలని అన్నారు. నాన్ జాయినింగ్ ఖాళీల్లో పదోన్నతుల కోసం యుటిఎఫ్ కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కే బిక్షపతి, ప్రధాన కార్యదర్శి డి. యాకూబ్, జి. రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి
బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి : సీపీఐ

నవతెలంగాణ- మరిపెడ

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఎన్డీఏ మిత్రపక్షాలైన ఏపీ బీహార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు భారీ మొత్తంలో కేటాయింపులు చేసి మిగిలిన రాష్ట్రాల పట్ల వివక్ష చూపించిందని, తెలంగాణలో ఉన్న ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అన్నారు. గురువారం మరిపెడ మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ నియంతృత్వ విధానాలను ప్రతిఘటించాలని అన్నాడు. భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి రాష్ట్రాల హక్కులను కాపాడటంలో సీపీఐ ప్రజాపోరాటాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. అనంతరం బడ్జెట్ పత్రాలు దహనం చేశారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి అబ్దుల్ రషీద్, టౌన్ కార్యదర్శి యాకన్న అంజి, నారాయణ, లింగన్న జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు బీసీ హాస్టల్‌లో గార్ల విద్యార్థి అదృశ్యం

నవతెలంగాణ-గార్ల



ఇల్లందు నియోజకవర్గంలోని బీసీ హాస్టల్‌లో మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం విద్యార్థి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... గార్ల మండలం చిన్న బంజార గ్రామానికి చెందిన బానోత్ తారాచంద్-పద్మ దంపతుల పెద్ద కుమారుడు బానోత్ తనీష్ ఇల్లందు పట్టణంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో ఉన్న బీసీ హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. కాగా బుధవారం అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు, బంధువులు ఎంత వెతికినా ఆచూకి లభించలేదు. ఈ విషయమై ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో హాస్టల్ వార్డెన్ ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు 9908135160, 9550051848లో సమాచారం అందించాలని బాధితులు కోరారు.

ఐఓబీ బ్యాంకు రైతులకు రుణమాఫీ 'సున్నా'

సాఫ్ట్‌వేర్ లోపాలు.. ఆన్‌లైన్ తప్పిదాలు ! -1050మంది రైతులకు రూ.5.82 కోట్లు పెండింగ్

రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఊరట కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రైతు రుణమాఫీని ప్రకటించింది. ఇందులో భాగంగా మొదటి విడత డబ్బులు ప్రభుత్వం విడుదల చేయడంతో రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ ఇల్లా పరిధిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ రైతులకు రుణమాఫీ కాలేదు.

నవతెలంగాణ-మహబూబాబాద్/ఇనుగుర్తి



మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో సాఫ్ట్‌వేర్ లోపాలు, ఆన్‌లైన్‌లో తప్పిదాలు మూలంగా రుణమాఫీ నిధులు రైతుల ఎకౌంట్‌లో జమ కాలేదు. ఫలితంగా ఆ రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 1050మంది రైతులకు చెందిన రూ.5కోట్లా 82లక్షలు పెండింగ్‌లోనే ఉన్నాయి. మహబూబాబాద్‌లో వివిధ బ్యాంకులకు చెందిన సుమారు 60 శాఖలు ఉన్నాయి. అందులో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుకు రెండు శాఖలున్నాయి. ఇనుగుర్తిలో ఒకటి, మహబూబాబాద్‌లో మరొకటి ఉంది. వీటి పరిధిలో ఒక్క రైతుకు కూడా రుణమాఫీ నిధులు అందలేదు. ఇనుగుర్తి శాఖ పరిధిలో లక్ష లోపు రుణం తీసుకున్న వారు 450మంది ఉండగా వారికి సుమారు రూ.2 కోట్లా 32 లక్షల రుణమాఫీ కావాల్సి ఉంది. మహబూబాబాద్ బ్రాంచీలో సుమారు 600 మంది రైతులు రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్నారు. వీరికి రూ.3.50 కోట్లు రుణమాఫీ అందాల్సి ఉండగా ఒక్కరికి కూడా రుణమాఫీ జరగలేదు.

ఆన్‌లైన్‌లో నమోదు కాని ఖాతాలు

సాఫ్ట్‌వేర్‌లో లోపాల మూలంగా ఆన్‌లైన్‌లో జీరో నమోదు కాకపోవడంతో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ పరిధిలోని రైతులకు రుణమాఫీ నిధులు అందలేదని అధికారులు చెబుతున్నారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు పరిధిలోని రైతులకు ఎకౌంట్ నెంబర్ 15 డిజిటల్ అంకెలుగా ఉన్నాయి. అదే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు పరిధిలోని రైతుల ఎకౌంట్ నెంబరు 10 అంకెలు మాత్రమే ఉంది. ఎస్‌బీఐలో ఖాతా ఉన్న రైతుల ఎకౌంట్ నెంబర్ 11 అంకెల్లో ఉంది. ఇందులో బ్యాంకులు రైతుల ఎకౌంట్ నెంబర్లు ఐఎఫ్ఎస్సీ కోడ్‌తో సహా నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సాఫ్ట్‌వేర్‌లో 14 అంకెల వరకు మాత్రమే ఖాళీ ఉన్నట్టు సమాచారం. ఐఓబీ పరిధిలోని ఎకౌంటు నెంబరు 15 అంకెల్లో ఉంది. ఈ క్రమంలో ఎకౌంట్ నెంబర్ ముందు ఉన్న సున్నాను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి వీలు లేకుండా పోయింది.

సున్నా అంకె నమోదు కాకపోవడంతోనే..

మహబూబాబాద్ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఎకౌంట్ నెంబర్ 15 అంకెల డిజిట్ సంబంధించిన ఒక '0' ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దాంతో వారికి వచ్చిన నిధులు వెనక్కి పోయాయి. మళ్లీ నిధులు రప్పించడం కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి వినతి పంపించాం. త్వరలో వారికి కూడా రుణమాఫీ నిధులు అందిస్తాం.

-ఎల్‌డీఎం సత్యనారాయణమూర్తి

కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు పరిధిలోని రైతులకు రుణమాఫీ నిధులు అందకపోవడం పట్ల సమావేశంలో కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. త్వరలో వారికి నిధులు అందించడం కోసం ఆన్‌లైన్‌లో లోపాలు సరిచేసి పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. త్వరలో వారి ఎకౌంట్‌లో కూడా నిధులు జమవుతాయి.

- సారయ్య, వ్యవసాయశాఖ రుణమాఫీ ఇన్‌చార్జి

విద్యార్థులు పోరాటాల్లో ముందుండాలి
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి బీ రెడ్డి సాంబశివ

నవతెలంగాణ-మహబూబాబాద్

విద్యార్థులు చదువుతోపాటు పోరాటాలలో ముందుండాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర మాజీ కార్యదర్శి బి రెడ్డి సాంబశివ అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొరివి మండలంలో విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా బి రెడ్డి సాంబశివ హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపైన కొట్లాడే ఏకైక సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. అలాంటి సంఘం నీడలో విద్యార్థులు విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటికీ విద్యార్థులకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకోవడం లేదని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తే ఎస్ఎఫ్ఐ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి దామర కిరణ్, జిల్లా కన్వీనర్ పట్ల మధు కర్నూలు కమిటీ సభ్యులు సూర్య జ్యోతిబసు, సింహాద్రి, రాజేష్, రాకేష్, మహేష్, నవీన్ వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.



నేరాల అదుపులో విద్యార్థుల పాత్ర కీలకం
షీ-టీమ్ ఎస్సై సునంద

నవతెలంగాణ-మహబూబాబాద్

నేరాల అదుపులో విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ కీలకపాత్ర పోషించాలని షీ-టీమ్ ఎస్సై సునంద అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని ఫానిని హై స్కూల్‌లో షీ టీం భరోసా- యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఈవిటీజింగ్, గుడ్ టచ్ బాడ్ టచ్‌లపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా లాంటి సోషల్ మీడియాలలో వ్యక్తిగత ఫోటోలు వివరాలు పంచుకోవద్దన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు ఏదైనా సమస్య తలెత్తితే షీ టీమ్‌కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే వాట్సాప్ 8712656935, 7901142009 ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫాణిని హై స్కూల్ హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు సార్, సీనియర్ ఉపాధ్యాయుడు వెంకన్న, అధ్యాపక సిబ్బంది, షీ టీం ఏఎస్ఐ ఆనందం, షీ టీం సిబ్బంది అరుణ, రమేష్, ఏహెచ్‌టీయు సిబ్బంది సుప్రజ, భరోసా స్టాఫ్ జోష్న, రేణుక పాల్గొన్నారు.

కూలీలకు వాన కవర్లు పంపిణీ

నవతెలంగాణ-గూడూరు



కూలీలకు వాన కవర్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రుణమాఫీ సందేశాన్ని వినిపించి మహిళా కూలీలకు వాన కవర్లతో పాటు స్వీట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ చంటి స్వామి గూడూరు టౌన్ ప్రెసిడెంట్ రాసమల్ల యాకయ్య, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడుఎలమందల శ్రీనివాస్, మండల సీనియర్ నాయకుడు రూప్ రెడ్డి వెంకట్ రెడ్డి, గూడూర్ మండలం యూత్ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ కిషన్ నాయక్, మాజీ వార్డ్ మెంబర్ శ్రీనివాస్, పిసా చట్టం ఉపాధ్యక్షుడు ధరావత్ కిషన్ నాయక్, తదితులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన వీడుకోలు

నవతెలంగాణ- చిన్నగూడూరు



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో బదిలీలు చేపట్టగా చిన్నగూడూరు హైస్కూల్లో బదిలీపై వెళ్లిన టీచర్లకు గురువారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహిం చారు. సుదీర్ఘకాలం విధులు నిర్వహించిన మ్యాథమెటిక్స్ బోధించిన బండా శ్రీనివాస్ రెడ్డి, బయోసైన్స్ బోధించిన రేణుకా దేవి, తెలుగు బోధించిన కొలిపాక శ్రీనివాస్, ప్రమోషన్ పొంది బదిలీ అయినా పీడీ పుష్పలీల, హిందీ బోధించిన ఎస్ సోనీ, తెలుగు బోధించిన ఆర్ సతీష్ కుమారులు బదిలీ అయ్యారు. ఇరువురిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పాఠశాలకు కుర్చీలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నక్కా రవికుమార్, ఉపాధ్యాయులు రెహమాన్, నాగేశ్వరరావు, సతీష్ రెడ్డి, రఘుపతి, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్లయ్య నాయక్‌ను కలిసిన మంగీలాల్

నవతెలంగాణ-బయ్యారం

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్) చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్‌ను గురువారం ఎల్‌హెచ్‌పిఎస్ ఏక్ మాత్రో రాష్ట్ర అధ్యక్షులు వాంకుడోత్ మంగీలాల్ నాయక్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లినట్లు తెలిపారు. ట్రైకార్ లోన్లు గిరిజనులందరికి అందించాలని, 370 జీవోలో గిరిజన ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అర్హులైన గిరిజనులందరికీ పోడు పట్టాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ కార్యదర్శి కోటియా నాయక్, టీఎస్‌టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రోస్టర్ పాటించాలి

నవతెలంగాణ-మహబూబాబాద్

లెఫ్ట్ ఓవర్‌లో మిగిలిపోయిన ప్రమోషన్స్‌లో ఎస్సీ, ఎస్టీ రోస్టర్ పాటించాలని ఎస్సీ, ఎస్టీ సంఘం జాతీయ కమిటీ ఉపాధ్యక్షులు పార్నంది రామయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డీఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. మహబూబాబాద్‌లో టీచర్స్ పదోన్నతుల విషయంలో, మిగిలిపోయిన పదోన్నతులను, ఎస్సి, ఎస్టీ ఖాళీల విషయంలో తిరిగి వారికే కేటాయించాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ రోస్టర్‌లో ఖాళీలను ఇతరులకు కేటాయించడానికి నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. సుదీర్ఘకాలంగా ప్రమోషన్స్ కోసం ఎదురు చూస్తున్న సందర్భంలో ఎస్సీ, ఎస్టీల ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చాగంటి ప్రభాకర్, మధ్యల వీర స్వామి, హైమవతి, యూరియా, రంగన్న నాయక్, లచ్చిరాం, మంగు నాయక్, నీలయ్య, జి వెంకన్న, బాలాజీ, దేవ్ సింగ్, వాసం నాగేశ్వరరావు, కృష్ణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలి
డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్



నవతెలంగాణ- మరిపెడ

మహిళలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా శ్రీ దుర్గా మండల సమైక్య కృషి చేయాలని డీఆర్డీఏ పిడి శ్రీనివాస్ అన్నారు. గురువారం మరిపెడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సమైక్య 16వ వార్షిక సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షురాలు చందా కరుణ అధ్యక్షతన జరిగింది. ఎంపీడీవో పి విజయ, పిడి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రెండు సంవత్సరాలకు చెందిన అభివృద్ధి నివేదికను అధ్యక్షురాలు కరుణ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలు రకాల బిల్లులను ఆమోదించారు. అనంతరం పిడి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీనిధి పథకం కింద రూ.56 కోట్ల రూపాయలు రుణాలు ఇవ్వగా, సుమారు మూడు కోట్ల రూపాయలు మొండి బకాయలుగా ఉన్నాయని వాటిని తిరిగి చెల్లించాలని చెల్లిస్తే కొత్త రుణాలు ఇస్తామన్నారు. రానున్న కాలంలో ప్రతి డ్వాక్రా సభ్యురాలు రూ.500 పొదుపులో జమ చేయాలని, తద్వారా లోను, ఇన్సూరెన్స్, ప్రమాద బీమా ఇన్సూరెన్స్ కింద రూ.10లక్షలు వస్తాయన్నారు.

మహిళల రక్తహీనతను నివారించాలి : ఎంపీడీవో పి విజయ

డ్వాక్రా సంఘాలలో పనిచేస్తున్న మహిళలు సంఘాల అధ్యక్షురాలు కార్యదర్శి ప్రతి మహిళకు రక్త పరీక్షలు నిర్వహించాలని, మహిళల్లో పెరుగుతున్న రక్తహీనత జబ్బుల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి విజయ సూచించారు. ఏపీఎం బానోత్ రాములు మాట్లాడుతూ.. మహిళా శక్తి పథకం కింద మండలంలో 563 సభ్యుల అభివృద్ధికి న్యూ ఎంటర్ప్రైజెస్ పథకానికి ఎంపిక చేసినట్టు తెలిపారు. చిన్నతరహా కుటీర పరిశ్రమలు నెలకొల్పి ఆర్థిక అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకున్నామన్నారు. 66 అంగన్‌వాడీ సెంటర్లకు 31 మంది పిల్లలకు దుస్తులు కుట్టి ఇచ్చినట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధికి గ్రామ సంఘం అధ్యక్షుల సహకారంతో కమిటీ చైర్మన్‌గా నియమించామని అన్నారు. మండల సమైక్య సంఘం అధ్యక్షురాలు చందా కరుణ, కార్యదర్శి జి మాధవి, కోశాధికారి ఎల్. మాధవి, ఉపాధ్యక్షురాలు ఎస్ యమునాలకు పదవి విరమణ సందర్భంగా వీడ్కోలు పలికారు. ఆడిటర్ పి రజిత, సీసీలు మంగమ్మ, రుక్మిణి, జానీ మియా, శ్రీను, చందులాల్, నాగిరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ దుర్గ మండల సమైక్య నూతన కార్యవర్గం ఎన్నిక



మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం శ్రీ దుర్గ మండల సమైక్య నూతన కార్యవర్గాన్ని గురువారం మండల ఐకెపి కార్యాలయంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా- అజ్మీర తండకు చెందిన అజ్మీర వసంత శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శిగా తాళ్ల ఊకల్ గ్రామానికి చెందిన ఏరోజ్జు మంజుల, ఉపాధ్యక్షురాలుగా రాంపురం గ్రామానికి చెందిన పసుపులేటి శోభ, కోశాధికారిగా ఎడ్జెర్ల గ్రామానికి చెందిన కె కష్ణవేణి, సహాయ కార్యదర్శిగా ఎల్లంపేట గ్రామానికి చెందిన స్రవంతిని ఎన్నుకున్నారు. ఎన్నుకున్న నూతన కమిటీకి డీఆర్డీఏ పిడి శ్రీనివాస్, ఏపీఎం బి రాములు, సిసిలు రుక్మిణి, మంగమ్మ, ఆడిటర్ రజిత తదితరులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.



ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ రాయితీలు

నవతెలంగాణ-గార్ల

రైతులు లాభాసాటి పంటల సాగుపై దృష్టి సారించాలని, ఈ పంటలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఎవో కె రామారావు కోరారు. మండలంలోని పెద్ద కిష్టాపురం గ్రామంలో రైతు భావుసింగ్ అనే రైతు సాగు చేసిన ఆయిల్ పామ్ పంటను గురువారం ఎఈ వో రాజశేఖర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట సాగుకు ప్రభుత్వం ఎకరానికి రూ.47,424 రాయితీ కల్పిస్తుందన్నారు. ఇందులో మొక్కకు రాయితీ రూ.11వేలు, నాటిన సంవత్సరం నుండి నాలుగు సంవత్సరాల వరకు ఎరువులు యాజమాన్యానికి, అంతర పంటలు వేసుకోవడానికి ఎకరానికి సంవత్సరానికి రూ.4200 చొప్పున నాలుగు సంవత్సరాలు చెల్లిస్తుందని చెప్పారు. బిందు సేద్యానికి ఎకరానికి రూ.19624 అందిస్తుందని అన్నారు. ఈ పంట ద్వారా రైతులకు 25-30 సంవత్సరాల వరకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని చెప్పారు. అంతర పంటల సాగు ద్వారా భూసారం పెంపొందించడంతో పాటు అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుపై సందేహాల కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.

తాపీ మేస్త్రి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ- కేసముద్రం రూరల్

కేసముద్రం మండలం కల్వల గ్రామంలో చెక్కల పుల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. బాధిత కుటుంబ సభ్యులు, కూతుర్లు లక్ష్మీ, కట్టమ్మ, కుమారులు కట్టయ్య ఐలయ్యను, అలాగే కత్రోజు సోమయాచారి అనారోగ్యంతో మరణించగా మృతుడి భార్య కళావతి, కొడుకు ప్రసాద్‌ను గురువారం సీపీఐ(ఎం) కేసముద్రం మండల కార్యదర్శి మోడెం వెంకటేశ్వ ర్లు, గండి శ్రీనివాస్, గంటా బాలకృష్ణారెడ్డి పరామర్శించారు. సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇరు కుటుంబాలకు 50 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమ్మిగౌడ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని అన్నారు. ఫౌండేషన్ గౌరవ సలహాదారులు సామల నరసయ్య, ఎర్రం శెట్టి అశోక్,గండి వీరేందర్ గౌడ్ కొండేటి కళాధర్, గంట సుధాకర్ రెడ్డి, పోడేటి దినేష్, కొంతం శ్రీనివాస్, ఆకుల సుధాకర్, బేతు అశోక్, చింతనూరి రాజయ్య, బొగ్గుల చంద్రశేఖర్ సామల చందు, డొనికని యుగంధర్, చిలుకూరి రాజు, సుంకరి వెంకన్న పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

వరంగల్-ములుగు

శుక్రవారం జులై 26, 2024 www.navatelangana.com

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షుడు మెరుగు వెంకన్న తల్లి ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డి, పర్వతగిరి పీఏసీఎస్ ఛైర్మన్ మనోజ్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, నాయకులు జూలపెల్లి దేవేందర్‌రావు, కంటెం, ఏకాంతం, చిదురు తిరుపతి, బోట్ల భాస్కర్, మనోహర్, చిదురు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



వడ్లకొండ గ్రామానికి చెందిన కోదాటి నరసింగరావు ఇటీవల మతి చెందగా హనుమకొండలోని వికాస్‌నగర్ వెళ్లి ఆయన దశదిన కర్మలో పాల్గొని నరసింగరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాష్ట్ర బడ్జెట్‌లో ఆదివాసీలకు అన్యాయం

వట్టం ఉపేందర్ రాష్ట్ర అధ్యక్షులు తుడుం దెబ్బ

నవతెలంగాణ-ములుగు



తెలంగాణ ప్రభుత్వం గురువారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్ ఆరోపించారు. గత ప్రభుత్వంఅసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేసి గిరిజనులకు విద్య,ఉద్యోగ,ఉపాధి రంగాలలో 10శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీర్మానించారని, ఆ 10శాతం శాతం రిజర్వేషన్‌ను ఈ ప్రభుత్వం తుంగలో తొక్కిందని అన్నారు. బడ్జెట్ కేటాయింపులలో రాష్ట్ర బడ్జెట్ 2,91,159 కోట్లలో కేటాయించగా, ఆదివాసీ గిరిజనులకు, గిరిజన సంక్షేమం కోసం 10శాతం ప్రకారం 29,115.9 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా 6శాతం గిరిజన రిజర్వేషన్‌ను పరిగణలోకి తీసుకొని 17,056 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారంగా సమీకత గిరిజనాభివద్ధికి తోడ్పాడతామని, ఐటీడీఏ లకు పూర్వ వైభవం తీసుకు వస్తామని, ఏజెన్సీ,విద్య,ఉద్యోగ,అభివద్ధి, ఆరోగ్యం, అటవీ హక్కుల చట్టం లను పరిరక్షిస్తామని ఎన్నికలలో ఆదివాసీ ఓట్లను దండు కొని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆదివాసీ గిరిజనులను పూర్తిగా విస్మరించి బడ్జెట్ కేటాయింపు చేశారని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

ఏఐఎస్‌బీ జాతీయ కమిటీ సభ్యుడు హాకీం నవీద్

నవతెలంగాణ-కాశిబుగ్గ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్ బి) జాతీయ కమిటీ సభ్యుడు హాకీమ్ నవీద్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొత్తం రూ. 2,91,159 బడ్జెట్లో విద్యారంగానికి కేవలం రూ. 21,292 కోట్ల (7.31శాతం) నిధులు మాత్రమే కేటా యించడం దారుణ మన్నారు. విద్యా రంగా నికి రాష్ట్ర బడ్జెట్లో 30శాతం నిధులు కేటాయించాలని గతంలో అనేక సందర్భాలలో ప్రభుత్వాన్ని కోరినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా గత ప్రభుత్వాల మాదిరిగానే విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు.



నల్లబెల్లి సెర్ఫ్ సీసీ రవి మృతి

కుటుంబ సభ్యులను ఓదార్చిన డీఆర్డిఏ పీడీ

నవతెలంగాణ-నల్లబెల్లి

మండలంలోని మేడపల్లి గ్రామానికి చెందిన వీలసాగరపు రవి (సీసీ) అనారోగ్య కారణాలతో గురువారం మృతి చెందారు. రవి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న డిఆర్డిఏ జిల్లా ప్రాజెక్టు అధికారి కౌసల్యాదేవి, ఏపీడి రేణుకా దేవితో కలిసి మేడపల్లి గ్రామానికి చేరుకొని రవి పార్తీవదేహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సంతాపం తెలిపారు. రవి మృతి సమాచారం తెలుసుకున్న జిల్లా వ్యాప్తంగా ఉన్న సెల్ఫ్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు, మహిళా బందాల సభ్యులు భారీగా తరలి వచ్చారు. రవి అంతిమయాత్రలో జిల్లా సెల్ఫ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు గుండేటి కుమారస్వామి, గోలి కొమురయ్య, గడ్డి అశోక్, సురేష్, సుధాకర్, ఏకాంబరం, శోభ, కిరణ్, సింగారపు బాబు, రాజయ్య, శోభ, శారద, పద్మ, కరుణ, జిల్లాలోని ఏపీఎంలు, సీసీలు, వివో ఏలు, గ్రామైక్య సఘాల ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌తో ఏజెన్సీలో భయంభయం

నవతెలంగాణ-తాడ్వాయి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా-ములుగు జిల్లా సరిహద్దుల్లో ఏజెన్సీ మండలాలు గురువారం ఉదయం ఉలిక్కిపడ్డాయి. నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన బద్రు, లచ్చన్నలతో పాటు సుమారు 15 మంది నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ సభ్యులు ఆయుధాలతో అక్రమంగా అప్రజాస్వామ్యంగా దామరతోగు, గుండాల, కరకగూడెం, తాడ్వాయి అడవి ప్రాంతంలో సంచరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ వ్యాపారస్తులను, రైతులను కాంట్రాక్టులను బెదిరిస్తూ చందాలు వసూలు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు, అటవీ ప్రాంతంలో పోలీస్ బలగాలు మావోయిస్టు కార్యకలాపాలను నిర్వహించడం కోసం, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడం కోసం కూబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా గురువారం ఉదయం కూబింగ్ చేస్తున్న పోలీస్ బలగాలపై అకస్మాత్తుగా నిషేధిత మారణాయుధాలతో మావోయిస్టులు కాల్పు ప్రారంభించారు. పోలీసులు ప్రాణాలను రక్షించుకునేందుకు ఎదురుకాల్పులు జరిపారు. కాల్పుల అనంతరం పరిశీలించగా అల్యూ గ్రీన్ దుస్తులు ధరించిన 25ఏండ్ల యువకుడి మృతదేహం 303 ఎస్ఎల్ఆర్ ఆయుధ మందు గుండు సామగ్రి విప్లవ సాహిత్యం తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతి చెందిన వ్యక్తి భూపాలపల్లి జిల్లా, ఘనపూర్ మండలం బుద్ధారం గ్రామానికి చెందిన నల్లమారి అశోక్ అలియాస్ విజేందర్‌గా గుర్తించారు. తప్పించుకున్న మావోయిస్టుల గురించి పోలీసులు అడవులను జల్లడపడుతున్నారు.

స్మారక కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 6న యాదిసభ

నవతెలంగాణ-కాశిబుగ్గ



సామాజిక ప్రజా కవుల, కళాకారుల స్మారక కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 6న గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ తెలంగాణ జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న యాది సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని స్మారక కమిటీ రాష్ట్ర కన్వీనర్ గడ్డం శరత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం లేబర్ కాలనీలోని అమరవీరుల స్తూపం వద్ద సుదమల్ల అశోక్ అధ్యక్షతన జరిగిన యాదిసభ కరపత్రాన్ని గడ్డం శరత్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాయుద్ధనౌక గద్దరన్నా, ఉర్దూ దినపత్రిక ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్‌ల ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని చుండూరు మతవీరుల 33వ వర్ధంతి యాది సభను స్మారక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ యాది సభకు ప్రజలు విద్యార్థులు మేధావులు కవులు కళాకారులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని గడ్డం శరత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామ్మూర్తి, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దల కుమారస్వామి ప్రముఖ కవి గాయకుడు లింగాల ఇమాన్యుయల్ తెలుగు ఫిలిం అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ పోగుల కన్నయ్య, సకల కళ సంస్కతిక మండలి తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం సుధాకర్, అంబేద్కరిస్ట్ ల్యాదల్ల భారత్, సామాజిక సేవకులు కంజర్ల జేకబ్, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం రమేష్ కుటుంబానికి అందజేత

నవతెలంగాణ-చెన్నరావుపేట



మండలంలోని ఇటీవల అనారోగ్యంతో మరణించిన చెందిన ఎడ్ల రమేష్ కుటుంబ సభ్యులకు గ్రామస్తులు అతనితో పాటు పరిచయం ఉన్న వారంతా రమేష్ మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి అయ్యో పాపం అంటూ కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రమేష్ కుటుంబానికి అండగా నిలవాలంటూ వాట్సప్ గ్రూపు ద్వారా సమాచారం ఇవ్వడంతో ఎంతోమంది స్పందించి ముందుకు వచ్చారు వారంతా ఇచ్చిన ఆర్థిక సహాయం రూ.66500 ఈ సాయాన్ని రమేష్ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల డైరెక్టర్ మాచర్ల ఎల్లాగౌడ్, ఎడ్ల మల్లయ్య, ఎడ్ల కుమార్, భూక్య శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ నాంపల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం

నవతెలంగాణ-చెన్నారావుపేట



మండలంలోని పాత మగ్దూంపురం గ్రామానికి చెందిన తీగారపు చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మతి చెందాడు. కాగా అతని కుమారుడు సాంబయ్య పదవ తరగతి స్నేహి తులు 30వేల500 ఆర్థిక సాయం గురువారం అందించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరా మర్శించారు. ఈ కార్యక్రమంలో ఈగ సత్యనారాయణ, రామగోని శ్యాం ప్రసాద్, కోల విజయ్ కుమార్, అడుప రమేష్, గుడిశాల సురేందర్ పెద్దమ్మల కట్ట స్వామి, పెద్ది సతీష్, హరీష్, చిగురు అనిల్, పబ్బతి విజేందర్, సంకటి చంద్రమౌళి, బండి వెంకటేశ్వర్లు, అంద్ర నవీన్ రెడ్డి తదితరులున్నారు.



రాష్ట్ర బడ్జెట్‌లో రైతుల సంక్షేమానికి పెద్దపీట

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జన్ను అరుణాకర్

నవతెలంగాణ-కాశిబుగ్గ

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెద్దపీట వేసిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జన్ను అరుణాకర్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ పూర్తిస్థాయి బడ్జెట్ రూ.2.91.191 కోట్లు కాగా అందులో వ్యవ సాయ, అనుబంధ రంగాలకు రూ.72,659 కోట్లు కేటాయించడం వ్యవసాయ రంగ అభివద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులకు అరుణాకర్ కతజ్ఞతలు తెలియజేశారు.



దోస్త్ మేరా దోస్త్ నువ్వే నా ప్రాణం

నవతెలంగాణ-పర్వతగిరి

ఎల్లప్పుడూ తమ వైరాన్ని చాటుకుంటూ బద్ధ శత్రువులుగా వుండే కోతి, కుక్క కలిసి దోస్త్ మేరా దోస్త్, నువ్వే నా ప్రాణం అంటూ కుక్క కోతిని తమ వీపు మీద ఎక్కించుకుని ఆప్యాయంగా తన నోటితో ముద్దాడుతూ వీధుల వెంట తిప్పుతూ తమ స్నేహాన్ని చాటు కున్నాయి. ఈ సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలో చోటు చేసుకుంది. కుక్క కోతి స్నేహితులుగా వుండి నేటి ఆధునిక యుగంలో విషం కక్కుతున్న ఈనాటి మానవ సభ్య సమాజానికి వాటి స్నేహం ఒక ఆదర్శం కావాలని మనమందరం కోరుకుందాం.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-పర్వతగిరి

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని నీలగిరిస్వామి తండాలో గురు వారం పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు పేకాటరాయులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6,190 నగదును సీజ్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

పెద్దవంగర ఏఈవో యశస్విని

నవతెలంగాణ పెద్దవంగర

అర్హులైన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని పెద్దవంగర ఏఈవో యశస్విని అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. 2024 జూన్ 28 వరకు నూతనంగా పట్టా పాస్ బుక్ పొందిన రైతులు, 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు లోపు వయసు గల రైతులు బీమా కు అర్హులని తెలిపారు. వారందరూ రైతు బీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు బీమా ఫారం నింపి దానితో పాటుగా నూతనంగా వచ్చిన పట్టా పాస్ పుస్తకం, రైతు ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను జత చేసి రైతులు స్వయంగా వెళ్లి, సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి ఆగస్టు 5వ తేదీ లోగా అందజేయాలన్నారు. మార్పు చేర్పుల కోసం ఇంతకుముందు నమోదు చేసుకున్న రైతులు ఎవరైనా సవరణలు ఉంటే తేదీ 30- 07-2024 లోపు సరి చేసుకోవాలని, ప్రమాదవశాత్తు నామిని చనిపోయిన, కొత్త నామిని మార్పు కోసం వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు మరణిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షలు నామిని కి ఇస్తుందని, రైతు బీమా ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సుప్రీంకోర్టు ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి నారాయణ బాబు

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

భారత సుప్రీం కోర్టులో పెండింగ్ కేసులను సామరస్య పరిష్కారానికి సత్వర న్యాయం అందించేందుకు ఈనెల 29 నుండి వచ్చే నెల ఆగస్టు 3 వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించాలని సుప్రీం కోర్టు నిర్ణయించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జయశంకర్-భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి నారాయణబాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... జిల్లావాసులు ఎవరైనా సుప్రీం కోర్టులో కేసులు ఎదుర్కొంటే జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిని గాని, హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శిని సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకోసం 040 - 23446723, 08713 - 221418లో సంప్రదించాలని సూచించారు.







టీయూడబ్ల్యూజేయు (ఐజేయు) మండల అధ్యక్షులుగా గుర్రపు యాకాంబ్రం

నవతెలంగాణ-గూడూరు

టీయుడబ్ల్యూజేయు(ఐజేయు) మండల అధ్యక్షులుగా గుర్రపు యాకాంబ్రంను ఏకగ్రీయంగా నియమించారు. గురువారం గూడూరు మండల కేంద్రంలో ఫంక్షన్ హాల్‌లో టీయూడబ్ల్యూజేయు(ఐజేయ) కార్యవర్గం ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్ జిల్లా కార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు గంధసిరి రవి హాజరయ్యారు. మండల అధ్యక్షులుగా గుర్రపు యాకాంబరం, ఉపాధ్యక్షులుగా కన్నబోయిన వెంకటేశ్వర్లు, బీరవెల్లి శ్రీధర్, బోడరాజు, ప్రధాన కార్యదర్శిగా భూక్య మంగీలాల్, సహాయ కార్యదర్శులుగా ఈసం సురేష్, దేశ్ నరేష్, ఎస్కే యాకుబలి, కోశాధికారిగా కుందూరి కరుణాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎల్లంకి వెంకటేష్, భీమ గాని యాదగిరి, భూక్య నరసింహ, గంధసిరి రవీందర్, పానుగంటి అజయ్ కుమార్, బూర్గు నవనీత్ కుమార్, సదివాల వీరస్వామి, పొన్నం రాకేష్ లు ఎన్నుకోబడ్డారు గూడూరు మండల సీనియర్ పాత్రికేయులు ముక్తవరపు సత్యనారాయణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాడుల నియంత్రణ కమిటీ కన్వీనర్ బేతమల్ల సహదేవ్, కొరవి మండల అధ్యక్షులు గుంటి సురేష్, కొత్తగూడ మండల అధ్యక్షులు సల్మాన్ గూడూరు సీనియర్ పాత్రికేయులు పానుగంటి శ్రీనివాస్, మహేష్, పాపయ్య, లక్ష్మణ్‌నాయక్, కిషన్‌రావు, పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట

వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి

నవతెలంగాణ-గూడూరు



శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మానుకో శాసనసభ్యులు మురళి నాయక్, నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డికి నెక్కొండ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం రైతు ప్రభుత్వంగా మరోసారి చరిత్ర సృష్టించిందని అన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అన్నిటిని 100శాతం నెరవేర్చే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు.

రాయల చంద్రశేఖర్ సంతాప సభ

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

ఖమ్మంలో రైలు ప్రమాదంలో చనిపోయిన సిపిఐఎంఎల్ మాస్ లైన్ కేంద్ర నాయకులు రాయల చంద్రశేఖర్ సంతాప సభ జూలై 28న ఖమ్మంలో జరుగుతుందని కేసముద్రం మండల కార్యదర్శి కె భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా విప్లవోద్యమంలో పనిచేసిన రాయల చంద్రశేఖర్ అకాల మరణం భారత విప్లవజమానికి తీరని లోటు అని అన్నారు. ఖమ్మంలో జరిగే సంతాప సభకు మాస్ లైన్ ఆల్ ఇండియా కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాకూర్,రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, కేంద్ర నాయకులు కేజీ రామచందర్,కే రమా,కెచ్చల రంగారెడ్డి, పాయం చిన్న చంద్రన్న తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. ఖమ్మంలోని ఎస్ ఆర్ గార్డెన్ లో జరుగు సంతాప సభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహబూబాబాద్ డివిజన్ నాయకులు కందాల రంగయ్య తోపాటు భూక్య బిక్షం, సుధాకర్, లక్ష్మి, వెంకటమ్మ పద్మ పాల్గొన్నారు.



బురదలో దిగబడిన ఇసుక లారీ

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ మండలంలోని పెద్దంపేట వాగు వద్ద పంకన ఇసుక క్వారీ నుండి వస్తున్న ఇసుక లారీ బురదలో దిగబడిపోయిన ఘటన గురువారం జరిగింది. దీంతో మహదేవపూర్ నుండి పలిమెల మండలంతో పాటు కన్నయ్య గూడెం వెళ్లే ఆర్టీసీ బస్సు, ఇతర వాహనాలు ద్వారా ముకునూరు నీలంపల్లి గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు ఇసుక లారీలు తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.

గుర్తింపు లేని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు : టీఎస్‌యుఎస్

నవతెలంగాణ -కోల్ బెల్ట్ :

సింగరేణి ట్రేడ్ యూనియన్ ఎన్నికలు జరిగి ఏడు నెలలు గడుస్తున్నా నేటికీ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు యాజమాన్యం గుర్తింపు పత్రాలు ఇవ్వకపోవడం ఏమిటని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య ప్రశ్నించారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయం బాగోతాలు రాజన్న భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గెలుపొందిన సంఘాలు ఎందుకు మాట్లాడటకుండా యాజమాన్యం కార్మికుల పట్ల కక్ష్యపూరితంగా వ్యవహరిస్తుంటే నిమ్మకు నీరెత్తినట్లు చోద్యం చూస్తున్నారని దుయ్యబట్టారు. గని స్థాయిలో కార్మిక సమస్యలపై గని మేనేజర్ కూడా స్పందించకుండా మేమేమీ చేయలేము జీఎం స్థాయిలో మాట్లాడుకోండి అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జీఎం కార్యాలయం గేటు కూడా దాటకుండా కార్మికులను ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆక్షేపించారు. కింది స్థాయి అధికారులు మాత్రం కార్మికుల సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అధికారుల పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ యు ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి,వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, నాయకులు దాసరి జనార్ధన్,కాసర్ల ప్రసాద్ రెడ్డి,నామాల శ్రీనివాస్,రాళ్ల బండి బాబు,కే .లింగన్న, వేరంటి శ్రీధర్, జయశంకర్, మధుకర్ , విజయ్ , ఎండి. సాజిద్‌తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్లు ! ఎన్నాళ్లీ పాట్లు ?

తండావాసులకు తప్పని ఇక్కట్లు

నవతెలంగాణ-ఇనుగుర్తి

ఇనుగుర్తి మండలం లోని పలు తండాలలో నాలుగు రోజులుగా కురుస్తున్న వానలతో మట్టి రోడ్లు బురద మయమయ్యాయి. గుంతల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అధికారుల తీరుపై విసుగెత్తిన కోమటిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కోక్యతండా వాసులు బురదగా మారిన రోడ్లపై నాట్లు వేసి నిరసన తెలిపారు. మరోవైపు లాలు తండా గ్రామపంచాయతీలోని మాసుకుంట తండావాసులు దశాబ్దాలుగా 2.కిలో మీటర్ల మట్టి దారితో ఇబ్బందులు పడుతున్నామని తమ సమస్యను అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని స్థానికులు 'నవ తెలంగాణ'తో చెప్పారు. నీటి నిల్వతో దోమలు, పాములతో భయంగా ఉందని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై గత అధికారులు, ప్రజా ప్రతినిధులతో చెప్పినా పట్టించుకో లేదని ఆరోపించారు. తండావాసుల ఇబ్బందులు గమనించి రోడ్ల పై బురద లేకుండా గ్రావెల్ పోయించాలని, సిమెంట్ రోడ్లు నిర్మించాలని వారు కోరారు.




క్వారీ డంపర్ల రాకపోకల వల్లే..



ఎడతెరపి లేని వర్షాలకు తోడు తండాలోని మట్టి రోడ్డుపై సమీపంలో ఉన్న క్వారీ డంపర్ల రాకపోకలతో రోడ్లు గుంతలుగా మారాయి. మట్టి రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారింది. దీంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి.

-భూక్య రాజ్‌కుమార్, కోక్యతండా వాసి

పాలకులు మారినా తప్పని తిప్పలు



ఎన్నికల సమయంలోనే వచ్చి తండాకు సీసీ రోడ్డు నిర్మిస్తామని చెప్పి తిరిగి కన్నెత్తికూడా చూడరు. గత పాలకుల నుండి ఇదే వైఖరి ఉంది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవున పెడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు నిర్మించాలి.

- ధరావత్ వెంకన్న, మాసుకుంటాతండా వాసి

మార్పు వచ్చే వరకూ....

ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

నవతెలంగాణ-మహబూబాబాద్



సమాజంలో మార్పు వచ్చి గుడుంబా నియంత్రణ జరిగేంత వరకు పోలీసులు దాడులు నిర్వహిస్తూనే ఉంటారని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. గురువారం తెల్లవారుజాము నుండి గుడుంబా స్థావారాలపై దాడులు నిరహించారు. గుడుంబా తయారీ సమూలంగా అణిచివేయడమే ధ్యేయంగా నిరంతరం దాడులు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ దాడులలో జిల్లా పరిధిలో మొత్తం 231 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, నల్ల బెల్లం 122 కేజీలు, 4425 లీటర్ల చెక్కెర పానకాన్ని ధ్వంసం చేసి 27 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరిపిన ఈ దాడులలో డిఎస్పీలు , సీఐలు , ఎస్.ఐలు మరియు సిబ్బంది కలిపి 123 మంది పాల్గొన్నారు. దాడుల అనం తరం గ్రామస్థులకు గుడుంబా వల్ల జరిగే నష్టాలపై వివరించి అవగాహన కల్పించారు. నూతన చట్టాలు గురించి, సైబర్ నేరాలు, ఆన్లైన్, ఆర్థిక మోసాలు, బాల్య వివాహాలు, లైంగిక దాడుల గురించి, కొత్త చట్టాల ప్రకారం అమలు చేసే కఠిన శిక్షల గురించి అవగాహన కల్పించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

బయ్యారం : గుడుంబా స్థావరాలు పై దాడి చేసి ఇద్దరి పై కేసు నమోదు చేసి బెల్లం సామాగ్రిని ధ్వంసం చేసినట్లు స్థానిక ఎస్సై తిరుపతి తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఉప్పలపాడు, నర్సా తండా, జగ్నాతండా గ్రామాల్లో గుడుంబా స్థావరాలు పై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఇద్దరి పై కేసు నమోదు చేసి, 20 లీటర్ల సారాయి, 400లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అనిల్, రమేష్, రజిని పాల్గొన్నారు.

17 లీటర్ల నాటు సారా స్వాధీనం...

ఇద్దరిపై కేసు

గార్ల: నాటు సారా తయారీ కేంద్రాల పై దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై జీనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ ఆదేశాల మేరకు మండలంలోని కోట్యానాయక్ తండా లో పోలీసులు నాటు సారా కేంద్రాల పై దాడులు నిర్వహించగా ఇదే గ్రామానికి చెందిన గుగులోత్ కిషన్, ధారావత్ శంకర్ ల వద్ద నుండి 17 లీటర్ల నాటు సారా,400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ దాడులలో సిబ్బంది రాం నర్సయ్య, కిషన్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రజల ఆశలపై నీళ్లు చల్లిన రాష్ట్ర బడ్జెట్

నవతెలంగాణ-మహబూబాబాద్



తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రథమ వార్షిక బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిన చందంగా ఉన్నదని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంద మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవిలి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో రాయల చంద్రశేఖర్ సంతాప సభ పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్టుగా రంగాల వారి కేటాయింపులు చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి హైదరాబాదు నగర అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందని అన్నారు. మూసి నది ప్రక్షాళన కంటే విద్య, వైద్యం రంగాల ప్రక్షాళన అవసరమని అందుకు బడ్జెట్లు కేటాయింపులు సరిగా లేవని అన్నారు. ఇటీవల కేంద్ర బడ్జెట్ ఉత్తరాది రాష్ట్రాలకు వరాలు కురిపించినట్టు రాష్ట్ర బడ్జెట్ హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు మూసి నదులపై మాత్రమే నిధుల కేటాయింపు సరికాదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి ఎన్నో ఆశలతో కాంగ్రెస్ను గెలిపిస్తే నేటి బడ్జెట్ ఆ ప్రజలకు తీవ్ర నిరుత్సాహాన్ని కలిగించిందని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపన ఉద్యోగ కల్పన విద్యారంగాన్ని అభివద్ధి చేయటం లాంటి దీర్ఘ కాలిక లక్ష్యాలు ఈ బడ్జెట్ లో కనిపించడం లేదని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌పై తీవ్రంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో సైతం తీర్మానాన్ని చేసి తమ నిరసనను తెలియజేసిందని అన్నారు. అదే ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ లో కేటాయింపులు వాస్తవిక అవసరాలకు తగ్గట్టుగా లేదని విమర్శించారు. నాయకులు బిల్లా కంటి సూర్యం బండపల్లి వెంకటేశ్వర్లు, ఉమాగాని సత్యం, కే భాస్కర్ రెడ్డి తోపాటు దొడ్డరాజు, యాకయ్య, వీరన్న, కష్ణయ్య సతీష్ బాలు వెంకనలి తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు ఆగస్టు 5గడువు

కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి అవకాశం

పాత వారికి ప్రభుత్వమే రెన్యూవల్ చేయనున్నట్లుగా ప్రకటన

నవతెలంగాణ-మల్హర్‌రావు



రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించింది. అందులో భాగంగా రైతు బీమాకు అవసరమైన ప్రీమియం చెల్లించేందుకు నిధులు కేటాయించింది. రైతు బీమా పథకం వల్ల కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు లేదా ఏ ఇతర కారణాల వల్ల నైనా మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకుండా ఉం డేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బీమా పథ కాన్ని ప్రవేశపెట్టింది. రైతు బీమా ఉన్న రైతు మరణిస్తే పది రోజుల్లోనే ఆ కుటుంబానికి బీమా సొమ్ము రూ.5 లక్షలు ప్రభుత్వం అందజేస్తుంది. రైతుపై ఎలాంటి భారం పడకుండా ప్రభుత్వమే రైతు బీమా ప్రీమియం చెల్లించనుంది.

కొత్త పాసుపుస్తకాలు వచ్చిన వారికి అవకాశం

మండలంలోని 15గ్రామ పంచాయతీ పరిధిలోని 22 రెవెన్యూ గ్రామాల్లో ప్రస్తుతం రైతు బీమా పథకం కింద అర్హులైన వారు 5,683 మందికి ప్రభుత్వమే రైతు బీమా ప్రీమియాన్ని చెల్లిస్తుంది.

కొత్తగా పాసుపుస్తకాలు వచ్చినవారికి అవకాశం....

మండలంలో దాదాపు వేయి మంది రైతులకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చాయి. వీరంతా రైతు బీమా పథకం కోసం ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఈ బీమా పథకం కింద అర్హులైన 5,683 రైతులకు యథావిధిగా ప్రభుత్వమే రెన్యూవల్ చేసి బీమా ప్రీమియాన్ని చెల్లించనుంది. కొత్త పాసుపుస్తకాలు ఉన్న వారితో పాటు మండల వ్యాప్తంగా కొంతమంది బీమా పథకం కోసం దరఖాస్తు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నారు. వీరు కూడా వచ్చే నెల 5వ తేదీలోగా రైతు బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. కొత్తగా బీమా కోసం దరఖాస్తు చేసుకునే రైతులు రైతు బీమా దరఖాస్తును పూర్తిచేసి పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు, నామిని పేరు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలి. అదే విధంగా నామిని పేరు మార్పు చేయాలంటే వారికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి : అత్తె సుధాకర్ మండల వ్యవసాయ అధికారి

కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు, గతంలో రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోని రైతులు వచ్చే నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఆయా గ్రామాల ఏఈఓలకు అందజేయాలి. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

5 ఎకరాల్లోపు రైతుల గుర్తింపు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి కొత్తగా బీమా చేసుకునే రైతుల కోసం నూతన ఆలోచనకు శ్రీకారం చుట్టిం ది. 5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్న కారు రైతులను గుర్తించి వారి నుంచి కచ్చితంగా రైతు బీమా కోసం దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. స్థానికంగా ఉండని రైతులు, వలస వెళ్లిన రైతులను గుర్తించి వారి ద్వారా రైతు బీమా దరఖాస్తులు చేయించాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.

ప్రజా పాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్ పార్టీ

నవతెలంగాణ-తొర్రూరు

రాష్ట్ర ప్రజలకు కలబొల్లి మాటలు చెప్పి ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికార పీఠం ఎక్కిన కాంగ్రెస్ పార్టీ పాలనను గాలికి వదిలేసి ముఖ్యమంత్రి సీటును కాపాడుకోవడానికి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని మానుకోట జిల్లా బిజెపి అధ్యక్షుడు ఎలమంచిలి వెంకటేశ్వరరావు ఆరోపించారు. గురువారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినప్పటికీ రైతులకు రైతుబంధు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వెంటనే రైతుబంధు నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై గలమత్తాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షులు అలిచేరి రవిబాబు జిల్లా కార్యదర్శి,తొర్రూర్ మునిసిపల్ కౌన్సిలర్ కొలుపుల శంకర్, తొర్రూర్ రూరల్ మండల అధ్యక్షుడు కస్తూరి పులేందర్, ప్రధాన కార్యదర్శి కొండ యాకన్న, మండల నాయకులు చెన్నోజు వెంకటేశ్వర్లు, కందగట్ల సోమశేఖర్, కిన్నెర యాదగిరి పాల్గొన్నారు.

నేరస్థులు తప్పు చేయాలంటే భయపడాలి

ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

నవతెలంగాణ-మహబూబాబాద్

కోర్టులో చార్జిషీట్ వేసిన ప్రతి కేసులో నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేయాలని, నేరాలకు పాల్పడితే శిక్షపడుతుందనే భయాన్ని నేరస్థులకు కలిగించాలని కోర్టు లో చార్జి షీట్ వేసిన ప్రతి కంటేస్టెడ్ కేసులో శిక్షల శాతం పెంచేందుకు కోర్ట్ డ్యూటీ పోలీస్ అధికారులు, ఎస్సై, సీఐలు న్యాయ అధికారులతో కలిసి సమన్వయంతో కృషి చేయాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. సీటడీ కోర్ట్ డ్యూటీ అధికారులతో జిల్లా మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం సమావేశమై ఆయన మాట్లాడారు. నేరాలను నియంత్రించడంతో పాటు నేరస్థులను కట్టడి చేయాలంటే పకడ్బందీ దర్యాప్తు నిర్వహించాలన్నారు. నేరస్థులకు శిక్ష పడటం ద్వారా భాధితలకు పోలీసు వ్యవస్థ పై మరింత నమ్మకం పెరుగుతుందని అన్నారు. కోర్ట్ కేసు విచారణలో నిందితుల హాజరైన వివరాలు నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతి రావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ ఎస్.ఐ పవన్, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం : పీఆర్టీయూ

నవతెలంగాణ- మరిపెడ

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పిఆర్టీయూ ధ్యేయమని పిఆర్టీయూ మండల అధ్యక్షులు కీసర రమేష్ రెడ్డి అన్నారు. 2024 సంవత్సర పిఆర్టీయూ సభ్యత్వ వారోత్సవాలను పురస్కరించుకొని సభ్యత్వ నమోదును మరిపెడ మండలంలోని మరిపెడ,గుండెపుడి,తానంచర్ల ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతుల కోసం, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతుల కోసం, బదిలీలు నిర్వహణ సానుకూలంగా జరగడానికి పిఆర్టీయూ సంఘం అవిశ్రాంతంగా కృషి చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్, సంఘ బాధ్యులు దోమల లింగయ్య, ఆర్.యాకయ్య, గుగులోత్ వెంకన్న, గుర్రం.వెంకన్న, ఆర్.బాబురావు పాల్గొన్నారు.



పురుషాధిక్య ఆధిపత్య భావజాలాన్ని వ్యతిరేకించాలి

నవతెలంగాణ-బయ్యారం

పురుషాధిక్య ఆధిపత్య భావజాలాన్ని వ్యతిరేకించాలని పిఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందేమంగా అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) మహబూబాబాద్ జిల్లా 7 వ మహాసభలు మండల కేంద్రంలో బొమ్మనబోయిన అనసూర్య నగర్ లో నిర్వహించడం జరిగింది. తొలుత పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు తిరుపతక్క జండా ఆవిష్కరించారు. అనంతరం మెయిన్ రోడ్డు సెంటర్ నుండి తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సామ రజిత, బొల్లం సోమక్క, ఆలకుంట్ల దర్గక్క, మంద పద్మ అధ్యక్షతన జరిగిన సభలో ప్రధాన వక్తగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందేమంగా పాల్గొని మాట్లాడారు. అర్ధరాత్రి ఆడవాళ్లు స్వేచ్ఛగా నడిరోడ్డు మీద నడిచినప్పుడు మాత్రమే స్వాతంత్రం వచ్చినట్లు అని గతంలో పాలకులన్నారని, కానీ నేడు పట్ట పగలు కూడా మహిళలు నడిరోడ్డు మీద స్వేచ్ఛగా తిరిగేటువంటి పరిస్థితి లేదని, మహిళలే కాదు పసి పిల్లలు కూడా స్వేచ్ఛగా తిరగలేనటువంటి స్థితి నేడు మనదేశంలో కొనసాగుతుందంటే ఈ దేశంలో మహిళలకు ఎలాంటి రక్షణ ఉందో అర్థమవుతుందని పేర్కొన్నారు.మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకువచ్చామని చెబుతున్న పాలకులు అవే చట్టాలకు తూట్లు పొడుస్తూ అత్యాచారాలు చేసినటువంటి వాళ్లను జైలుల నుండి విడుదల చేసి ఘనంగా వారిని సన్మానించుకుంటూ ఊరేగిస్తున్న స్థితి మనదేశంలో కొనసాగుతుందని అన్నారు. జిల్లా అధ్యక్షురాలు తిరుపతక్క మాట్లాడుతూ.. స్త్రీ పురుష సమానత్వం కై మహిళలు నేడు కొట్లాడాల్సిన అవసరం మరింత పెరిగిందని, మహిళల పై బ్రాహ్మణీయ సంస్కృతి పెరిగిపోతుందని వారిని వంటింట కుందేలుగా మార్చి వేస్తున్నారని, ప్రశ్నించడాన్ని స్వేచ్ఛగా ఎలిగెత్తి పోరాడడాన్ని బరితెగింపుగా ప్రచారం చేస్తున్నారని, ప్రశ్నించే వారిని నిర్బంధిస్తున్నారని జైల్లో బంధిస్తున్నారని అన్నారు. ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా మహిళలు సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. ఈ సభలలో పిఓడబ్ల్యు నాయకులు ఎండి కవిత, సారా కవిత, నీలం రజిత, ఊడుగుల కనకమ్మ ఉపేంద్ర, చింతా లక్ష్మి, గుగులోతు లక్ష్మి, బోళ్ళ సుజాత, నీరజ, తోకల సుగుణ, సెగ్గం సమ్మక్క పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
శుక్రవారం | జులై 26, 2024 | www.navatelangana.com

ఆరెపల్లి ఎస్ఆర్ఆర్ కాలనీ లో సమస్యల విలయతాండవం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

గ్రేటర్ వరంగల్ మూడవ డివిజన్ ఆరెపల్లి ఎస్ ఆర్ ఆర్ కాలనీలో సమస్యలు విలయతాండవం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేదని స్థానిక కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఇక్కడి ప్రజల దాహార్తి తీర్చేందుకు కనీసం మిషన్ భగీరథ పైపు లైన్ కూడా లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం అవుతోంది. ఫ్లోరైడ్ నీటితో బాధపడుతున్నామని ఎన్నోసార్లు అధికారులకు, నాయకులకు వినతి పత్రాన్ని అందజేసినా ఫలితం లేకుండా పోయిందని కాలనీ వాసులు తెలియజేసారు. కాలనీ అధ్యక్షులు జంగా కొమురయ్య మాట్లాడుతూ ఒక్క చుక్క మున్సిపల్ నీటిని వాడకున్నా ఇప్పటికీ మేము నీటి పన్ను చెల్లిస్తున్నామని ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తున్నారు. ఈ కాలనీ కి చెత్త సేకరణ కోసం వాహనం కూడా రాదని, శానిటేషన్ సిబ్బంది కూడా దోమల మందు పిచికారీ, ఫాగింగ్ కూడా చేయరని అధ్యక్షులు తెలియజేసారు. నడిచేందుకు రోడ్డు కూడా లేవని, దీంతో వర్షాకాలం లో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ కార్యదర్శి రాజయ్య తెలిపారు. కార్పొరేటర్ కు, ఎమ్మెల్యే కు, చివరకు గ్రీవెన్స్ సెల్ లో కూడా సమస్యలు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక నాయకులు మా గోడు పట్టించుకుని మా కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమం లో కాలనీ వాసులు కుమార్, సురేష్, రత్నాకర్ రెడ్డి, వేణు, భిక్షపతి మౌలానా, అక్బర్, నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ

నవతెలంగాణ-శాయంపేట



గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ అని మాజీ సర్పంచ్ భూక్యా రమేష్ అన్నారు. మండలంలోని సూర్యానాయక్ తండ గ్రామంలో గిరిజన అవివాహితులైన యువతులు తీజ్ పండుగ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. . ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దమనిషి బానోతు మొగిలి, మాజీ ఉపసర్పంచ్ వస్రం, అజ్మీర్ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ రెడ్యా నాయక్, యువతీలు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: డాక్టర్ కవిత

నవతెలంగాణ-ధర్మసాగర్



విష జ్వరాలు ప్రబలకుండా మండల ప్రజలు దోమల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పీడీఎంవో డాక్టర్ కవిత అన్నారు. గురువారం మండలంలోని దేవునూరు గ్రామంలో వర్షాకాలంలో వచ్చు విష జ్వరాల దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యగా ధర్మసాగర్ మండలం వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలు సూచనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ యన్.విజయలక్ష్మి, సదిరం విజయ, సిహెచ్.సత్య ప్రకాష్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. .

కాంగ్రెస్ పార్టీ రైతు ప్రభుత్వం

మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



రాష్ట్ర శాసనసభలో బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి రూ.72,659కోట్లు అదేవిధంగా హర్టికల్చర్ రంగానికి రూ.737 కోట్లు అదేవిధంగా పశు సంవర్ధక శాఖకు రూ.1980 కోట్లు కేటాయించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కెఆర్నాగరాజు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్రెడ్డిలకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేసి వారి హామీని నిలబెట్టుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా రైతులకు ఆదుకోవడానికి బడ్జెట్లో అగ్రభాగాన నిధులు కేటాయించినందుకు రైతుల తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కేవీపీఎస్ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద సంపత్

నవతెలంగాణ- హనుమకొండ/హనుమకొండ చౌరస్తా

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద సంపత్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ 300 మంది విద్యార్థులు ఉన్న ఆశ్రమ పాఠశాలలో పడుకోవడానికి హాలు లేదు, డైనింగ్ హాల్ లేదు, డార్మెటరీ, డైనింగ్ హాల్ అన్నీ ఒకే భవనంలో నిర్వహిస్తున్నారని అన్నారు.కిటికీలు లేకపోవడం వలన దోమలు విపరీతంగా వస్తున్నాయని, బాత్రూములకు డోర్లు లేవు, అపరిశుభ్రంగా ఉన్నాయని అన్నారు. బ్లీచింగ్, ఫినాయిల్ వాడడం లేదన్నారు. వాటర్ ట్యాంకు శుభ్రం చేయకపోవడం వలన నీరు పచ్చగా వస్తుందని, నీళ్ల చారు, నీళ్ల మజ్జిగ, సాంబారు పెడుతున్నారని ఆరోపించారు. వారానికి ఒకసారి మాత్రమే గుడ్డు పెడుతున్నారని, ఒకసారి మాత్రమే పల్లి పట్టి ఇస్తున్నారని ఆరోపించారు. అన్నం ముద్దలాగా, సరిగా ఉడికి ఉడకనట్లు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఒరుగంటి సాంబయ్య, ఉపాధ్యక్షులు దూడపాక రాజేందర్ ,సతీష్, అనిల్, ఉపేందర్ పాల్గొన్నారు.



ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ పరిధిలో ఏ జబ్బులు ఉన్నాయో ప్రజలకు తెలుపాలి: కలెక్టర్



నవతెలంగాణ-సుబేదారి

ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ పరిధిలో ఏ జబ్బులు ఉన్నాయో ప్రజలకు తెలపాలి, వాటి ఖర్చు వివరాలను తెలుపుతూ బుక్ లెట్స్ తయారు చేయాలని వాటిని గ్రామపంచాయతీ ఆఫీసులలో,మున్సిపల్ వార్డులలో అందరికీ అందుబాటులో ఉండేట్లు చూడాలని సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య గురువారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి కొరకు తీసుకోవలసిన చర్యలపై ఆసుపత్రుల సూపరిండెంట్లు తో జరిగిన సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల్లో ప్రభుత్వ ఆసుపత్రులలోని వార్డులకు, బెడ్లకు నెంబర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులలో ఉన్న పేషెంట్ పేరు ఏ వార్డ్ లో ఉన్నది ,బెడ్ నెంబర్లు ఆసుపత్రి ముందు బోర్డులపై ప్రదర్శించాలని, దీని వలన పేషెంట్ సహాయకులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఎప్పటికప్పుడు పేషంట్ల వివరాలు బోర్డులపై నమోదు చేస్తుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, పరకాల ఆర్డిఓ నారాయణ, జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి సాంబశివరావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులను నియంత్రించాలి

ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



కల్వకుంట్ల చంద్రశేఖర రావు రెండు పర్యాయాలు ముఖ్య మంత్రి గా ప్రభుత్వంలో నాయకులు మంత్రులు కార్పొరేటు యజమానులతో పాటు అనేకమంది అధికారులను కూడా అవినీతి మయంచేయడం జరిగిందని, గత ప్రభుత్వంలో కొంతమంది అధికారులు నాయకులు కార్పొరేట్ సంస్థల యజమానులు ఇంకా కల్వకుంట్ల చంద్రశేఖర రావు కుటుంబ సభ్యులు కొంతమంది సమీప బంధువులు రాష్ట్రాన్ని దోచుకోవడం జరిగిందని గ్రహించిన ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఓడించడం జరిగిందన్నారు. శాసనసభ ఎన్నికల్లోనే కాకుండా ఇటీవలి లోకసభ ఎన్నికల్లో కూడా గుండు సున్నా పెట్టడం జరిగిందని, అనేకమంది రాష్ట్రంలో అనేకమంది ఉన్నతాధికారులు కల్వకుంట్ల వారి అవినీతిలో పాలుపంచుకున్నారని ఇటీవల అనేక కుదంతాలు బయటికి ముఖ్యంగా రిజిస్ట్రేషన్, రెవెన్యూ పోలీసు నీటిపారుదల శాఖలలో అవినీతి పెచ్చు పెరిగి ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టడమే కాక ఇటు ప్రజలను పీడించి వసూలు చేస్తూ వందల కోట్లకు పరిగెత్తినారని అక్రమ ఆస్తులను బినామీ పేర్లతో జమ కట్టుకున్నారని అనేక మంది పట్టుబడ్డ అధికారుల చరిత్ర తెలుపుతున్నదన్నారు. ఏసీబీ వలన చిక్కని వందలాదిమంది అధికారులు ఇంకా కొత్త ప్రభుత్వంలో కూడా అదే పోకడలు అదే అవినీతి కొనసాగిస్తున్నారని ప్రజలు బాధితులు చెప్పుకోవడం బాధాకరమన్నారు.. ఎన్ని లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ రూపొందించి విడుదల చేసినప్పటికీ ప్రజలకు అందులో సగం కూడా చేరకపోవడం చాలా దుర్మార్గమైన వ్యవస్థను ప్రక్షాళన చేయవలసిన బాధ్యత కొత్త ప్రభుత్వం పై ఉందని గుర్తించాలన్నారు. అవినీతిని నియంత్రించడానికి ప్రభుత్వంతోపాటు బాధితులు, ప్రజలు, చైతన్యవంతమైన పౌరులు అవినీతిపరులైన అధికారులను పట్టి ఇవ్వడానికి సహకరించినదే ఈ మహమ్మారి పోదని ప్రొఫెసర్ కూరపాటి వెంకట్నారాయణ ఆవేదన వెలిబుచ్చారు. ఉద్యోగ సంఘాలు నిజాయితీపరులైన ఉద్యోగులు కూడా ఈ అవినీతి నిర్మూలన కార్యక్రమంలో పాల్గొనవలసిన అవసరం గుర్తించాలని మనవి చేశారు.

. బడ్జెట్లో విద్యారంగానికి కేటాయింపులు నిరాశ కలిగించింది

టీఎస్ యుటిఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు

నవతెలంగాణ-సుబేదారి



బడ్జెట్ లోవిద్యారంగానికి కేటాయింపులు నిరాశ కలిగించిందని టీఎస్ యుటిఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం శాసనసభలో పూర్తిస్థాయి బడ్జెట్లో ప్రవేశపెట్టిందని, రూ.2.91.159 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. దీనిలో వ్యవసాయ రంగానికి పావు వంతు సుమారు 72 ,659 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం ఈరోజు మొత్తం బడ్జెట్లో కేవలం 21,292 కోట్లు కేటాయించారు .ఇది మొత్తం బడ్జెట్లో కేవలం 7.3 శాతం మాత్రమే.గత పది సంవత్సరాల ప్రభుత్వ పాలనలో విద్యారంగానికి కేవలం నామమాత్రపు కేటాయింపులు చేశారని గతంలో విమర్శించిన వారే నేడు మళ్లీ బడ్జెట్లో విద్యారంగానికి మొండి చేయి చూపారన్నారు. అంగన్వాడీలలో ప్రీ స్కూల్ ప్రవేశపెట్టడం సంతోషించదగిన విషయమన్నారు.

చిట్టీల పేరుతో ప్రభుత్వ ఉద్యోగి ఘరానా మోసం..

బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

అరెస్ట్.. రిమాండ్..

వివరాలు వెల్లడించిన ఇన్ స్పెక్టర్ సురేష్

నవతెలంగాణ- హసన్పర్తి

పది మందికి పాఠాలు బోధించి విద్యార్థులను సన్మార్గంలో పెట్టే వలువురికి ఆదర్శంగా ఉండాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మో సాలకు పాల్పడుతోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ చిట్టీల వ్యాపారం కొనసాగిస్తూ మోసాలకు పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగిపై బాధితుల ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఇన్ స్పెక్టర్ జవ్వాజి సురేష్ తెలిపారు. ఇన్ స్పెక్టర్ సురేష్ కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే... హనుమకొండ రాంనగర్ కు చెందిన కామ మాధవి 2011 నుంచి 2021 వరకు హసన్ పర్తి మండలం మడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేసింది. ఆమె పని చేస్తున్న కాలంలోనే ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దుగ్గొండి మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన అమ్మ కృష్ణను లక్ష్మీ సాయి చిట్స్ అనే పేరుతో చిట్టీ వేయించుకొని మోసానికి పాల్పడినట్లు బాధితుడు తెలిపాడు. అంతే కాకుండా ఆమె వద్ద చిట్టీ వేసే ఒక నెల (చివరి నెల) డబ్బులు కట్టనవసరం లేదని మంచి లాభంతో చిట్టీ డబ్బులు ఇస్తానని నమ్మబలికి నెలకు రూ.12,500 చొప్పున మొత్తం 22 నెలల పాటు రూ. 2.75 లక్షలు అన్ లైన్ పేమెంట్ ద్వారా మాధవి, ఆమె అసిస్టెంట్ వెంకట్ కు చెల్లించినట్లు బాధితుడు తెలిపాడు. చిట్టీ కమిట్ మెంట్ ప్రకారం జూన్ 2023 నాటికి రూ.3.95 లక్షలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు తిరిగి చెల్లించ కుండా మోసం చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మాధవితో పాటు ఆమె అసిస్టెంట్ వెంకట్ పై చట్ట పరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితుడు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు చిట్టీ పేరుతో మోసానికి పాల్పడిన నిందితురాలు ప్రస్తుతం దామెర ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న కామ మాధవి, ఆమె అసిస్టెంట్ వెంకట్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు ఇన్ స్పెక్టర్ జవ్వాజి సురేష్ తెలిపారు. పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పాల్గొన్న ఎస్సై దేవేందర్, కానిస్టేబుళ్లు గీత, ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిలర్ తల్లి రాధమ్మ పార్థివ దేహానికి నివాళి

నవతెలంగాణ- పరకాల

పట్టణంలోని 15 వ వార్డు కౌన్సిలర్ చందుపట్ల సుజాత -సాయి తిరుపతి రెడ్డిల తల్లి (రాధా) వనమ్మ(85) గురువారం వారి స్వగృహంలో ఆరోగ్యంతో గురువారం మృతి చెందడంతో స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ సోద అనిత రామకృష్ణ పాల్గొని వనమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు . .ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రేగూరి జయపాల్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు ఒంటేరు సారయ్య ,గోరె ప్రవలి -రాజు ,బండి రాణి - సదానందం ,పసుల లావణ్య-రమేష్, రజిని- నవీన్, నల్లెల జ్యోతి - అనిల్,నాయకులు బండి శ్రీధర్ రమణారెడ్డి,జాఫర్ రిజ్వి తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

పరకాల అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని 15వ వార్డు(చందుపట్ల)స్థానిక కౌన్సిలర్ చందుపట్ల సుజాత- సాయి తిరుపతి రెడ్డిల తల్లి వనమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో వనమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.